సంపుటి : 9
సంచిక : 299
బుధవారం
22 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వంవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999



## ఏపీలో యూఏఈ
# ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు నాంది

- ఏపీ ఈడీబీతో యూఏఈ అవగాహనా ఒప్పందం
- ఫుడ్ ప్రాసెసింగ్ లో యూఏఈ పెట్టుబడులకు మార్గం సుగమం
- వాణిజ్యం, ఎగుమతులు, పెట్టుబడులకు యూఏఈ క్లస్టర్ సహకారం
- తొలి పెట్టుబడిగా చిత్తూరులో యూఏఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్
- రూ.100 కోట్లతో పెట్టుబడితో ముందుకు వచ్చిన ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్
- సీఎం చంద్రబాబు, యూఏఈ మంత్రి అబ్దుల్లాబిన్ తౌక్ అల్ మర్రీ సమక్షంలో ఎంఓయూ

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ ఏడాది దావోస్‌లోని ప్రపంచ ఆర్థిక సదస్సులో కుదుర్చుకున్న మరో ఒప్పందం ఇవాళ సాకారమైంది. యూఏఈ ఫుడ్ క్లస్టర్ ద్వారా ఏపీలోని ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎగుమతులు, వాణిజ్యం, పెట్టుబడులను పెట్టేలా ఏపీ ఈడీబీ-యూఏఈకి చెందిన ఫుడ్ క్లస్టర్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈమేరకు రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు, యూఏఈ ఆర్థిక, పర్యాటక విభాగం మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ద్వారా పెద్ద ఎత్తున ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతులు, విదేశీ వాణిజ్యం సహా యూఏఈకి చెందిన సంస్థలు పెట్టుబడులు పెట్టేలా ఈ ఒప్పందం మిగతా .. 2లో..



# ప్రధాని నివాసం వద్ద హైడ్రామా

- రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నీట్ వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలపై మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసన
- విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుబట్టడంతో విఫలమైన చర్చలు
- అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్
- ఢిల్లీలో కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తత

**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఆ పార్టీ ఎంపీలు, ముఖ్య నేతలు మెరుపు ధర్నాకు దిగారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పాటు ఈ అంశాన్ని పార్లమెంట్‌లో చర్చించాలనే డిమాండ్లతో దాదాపు 3 గంటలకు పైగా ధర్నా కొనసాగింది. మరోవైపు, కాంగ్రెస్ ధర్నా మిగతా .. 2లో..



## పంచదార్ల కొండపై కూటమి నేతలు
# అక్రమ మైనింగ్

శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ



**పంచదార్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం, రాంబిల్లి మండలంలోని పంచదార్ల గ్రామంలో ఉన్న ఫణిగిరి కొండపై కూటమి నేతలు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారంటూ వైసీపీ నేతలు మిగతా .. 2లో..

# ప్రతి ఓటులో ప్రజాస్వామ్య స్పందన

- ప్రజల భాగస్వామ్యమే ప్రజాస్వామ్యానికి అసలైన బలం - ఓటు హక్కు.. కేవలం హక్కు మాత్రమే కాదు.. బాధ్యత కూడా
- ఓటు విశిష్టత స్ఫూర్తితో యువత ముందడుగు వేయాలి - ఓటర్ల అర్హత అంశంపై 9-సోపానాల ద్వారా క్షేత్రస్థాయి అధ్యయనం
- విస్తృత వినియోగం లక్ష్యంగా నమూనా ప్రమాణాల రూపకల్పనకు కసరత్తు - ఓటర్ల అర్హతపై అత్యుత్తమ విధానాలపై అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో వక్తల మాట




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రజల భాగస్వామ్యమే అసలైన బలమని, ప్రతి ఓటు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే అమూల్యమైన శక్తి అని వక్తలు పేర్కొన్నారు. ఓటు హక్కు అనేది కేవలం రాజ్యాంగం కల్పించిన హక్కు మాత్రమే కాదని, ప్రతి పౌరుడు నిర్వర్తించాల్సిన అత్యున్నత బాధ్యత కూడా అని వారు స్పష్టం చేశారు. మంగళవారం నగరంలోని లెమన్ ట్రీ హోటల్‌లో ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడీఈఎం), ఈసీఐ, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్ (ఐడియా), ఏపీ సీఈవో సంయుక్త ఆధ్వర్యంలో ఓటర్ల అర్హతలపై అంతర్జాతీయ వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యశాలకు ఈసీఐ, ఐఐఐడీఈఎం, వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల విభాగాల ప్రతినిధులు, విద్యావేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు భౌతికంగా, వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథి, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా మిగతా .. 2లో..

## వైకాపా మాజీ ఎమ్మెల్యే అనిల్‌పై
# కేసు నమోదు



**పామర్రు, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లా పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత కైలే అనిల్‌పై కేసు నమోదైంది. నిన్న పామర్రు పోలీస్ స్టేషన్‌కు అనుచరులతో వచ్చి హంగామా సృష్టించారు. పోలీసు విధులకు అడ్డుపడ్డారంటూ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు మిగతా .. 2లో..

## ముడి పొగాకుపై పన్ను తగ్గింపునకు
# కేంద్రానికి వినతి



**న్యూఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ముడి పొగాకుపై ప్రస్తుతం అమలులో ఉన్న 40 శాతం వస్తు సేవల పన్నును 28 శాతానికి తగ్గించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర ప్రజాప్రతినిధులు, పార్లమెంట్ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని ఎఫ్‌సీవీ పొగాకు రైతులు, వ్యాపారులు, ఎగుమతిదారులు ప్రస్తుతం అమలులో ఉన్న అధిక పన్ను భారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు మంత్రికి వివరించారు. రైతుల మిగతా .. 2లో..


## భక్తుల రద్దీ.. తిరుపతిలో
# దర్శన టోకెన్ల జారీ రద్దు



**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో గురువారం దర్శనానికిగాను తిరుపతిలోని మూడు కేంద్రాల వద్ద బుధవారం జారీ చేసే ఎస్ఎస్‌డీ టోకెన్లను రద్దు చేశారు. శుక్రవారం దర్శనానికిగాను గురువారం మధ్యాహ్నం నుంచి మిగతా .. 2లో..

# ఐదేళ్లలో జరిగిన భూ అక్రమాలపై చర్యలు

రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సామాన్యుల ఇబ్బందులు తొలగించేవే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల(ఆర్ఎస్‌కే)ని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. ఇవి ప్రజలకు మేలు చేసేవే తప్ప ఏ ఒక్కరికీ నష్టం చేయవని స్పష్టంచేశారు. డాక్యుమెంట్ రైటర్లను పిలిపించి మాట్లాడితే.. వారు కూడా దీనిపై సానుకూలంగా స్పందించారన్నారు. కొన్ని రాజకీయ పార్టీల స్వార్థం కోసం వేసే ట్రాప్‌లో పడొద్దని కోరారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా ఆర్ఎస్కేలు.. ఒక నూతన సాంకేతిక విధానమని తెలిపారు. గొడ్డలి పార్టీ రాజకీయ స్వలాభం కోసమే

## హోంమంత్రి అనితపై
# అంబటి వ్యాఖ్యలకు నిరసన



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ కార్యకర్తలు మంగళవారం కాకినాడలో ఆందోళన నిర్వహించారు. అంబటి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జి పసుపులేటి చిన్నబాబు మాట్లాడుతూ మహిళా మంత్రిని అవమానకరంగా దూషించిన రాంబాబు తీరు దారుణమన్నారు. ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకునే విధంగా వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టకపోతే మాదిగలు, మహిళా సమాజం ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఎమ్మార్పీఎస్, మిగతా .. 2లో..

## కాంగ్రెస్ నేతల నిర్బంధంపై స్పందించిన
# తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఢిల్లీలో ప్రధాని మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ నేతల నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కుపై దాడిగా అభివర్ణించారు. యువత పోరాటానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందన్నారు. యువత న్యాయమైన డిమాండ్లకు దేశ ప్రజలూ మద్దతుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. జైలుకు పంపినా, మిగతా .. 2లో..




# యూకేలో తొలి ఏఐ మంత్రిగా భారతీయుడు




**విశ్వం వాయిస్ న్యూస్ :** బ్రిటన్ నూతన ప్రధానమంత్రిగా ఆండీ బర్న్‌హామ్ (56) బాధ్యతలు చేపట్టగా.. భారత మూలాలున్న ఇద్దరికి ఆయన క్యాబినెట్‌లో మంత్రి పదవులు దక్కాయి. ఒకరు కనిష్క నారాయణ్ కాగా.. మరొకరు లీసా నాండీ. వేల్స్ నుంచి ఎంపీగా గెలిచిన కనిష్క యూకే తొలి ఏఐ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కీర్‌స్టార్మర్ ప్రభుత్వంలో సాంస్కృతిక శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన లీసా నాండీకి మరోసారి అదే పదవి దక్కింది.

**ఎవరీ కనిష్క..?**

కీర్ స్టార్మర్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన కనిష్క.. ఆన్‌లైన్ భద్రత, కృత్రిమ మేధ విభాగాన్ని పర్యవేక్షించేవారు. ఇప్పుడు పూర్తిస్థాయిలో మిగతా .. 2లో..

# రష్యా దౌత్యవేత్తకు భారత్ సమన్లు



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** రష్యా దౌత్యవేత్త వ్లాదిమిర్ లడనోవ్‌కు భారత విదేశాంగ శాఖ సమన్లు జారీ చేసింది. ఆదివారం ఉక్రెయిన్‌లోని ఒడెస్సా పోర్టు నుంచి వెళ్తున్న వాణిజ్య నౌకపై మాస్కో చేసిన దాడిలో నలుగురు భారత నావికులు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంది. ఇలాంటి దాడుల కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని.. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం, అమాయక పౌర సిబ్బంది ప్రాణాలకు ప్రమాదం కలిగించడం, వాణిజ్య స్వేచ్ఛకు ఆటంకం కలిగించడం వంటివి మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ప్రధాని నివాసం వద్ద హైడ్రామా

చేసిన ప్రాంతాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ స్వల్పంగా గాయడినట్లు సమాచారం. పోలీసులు అదుపులోకి తీసుకొని తరలించే క్రమంలో ఆయన ముక్కు వద్ద గీసుకుపోయిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

**మందిర్ మార్గ్ పీఎస్‌కు చేరుకున్న సోనియా గాంధీ**

రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలిసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అక్కడికి చేరుకున్నారు. తొలుత ఆమెను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. ఆ తర్వాత కాసేపటికి లోపలికి పంపడంతో ప్రియాంకను ఆమె కలిశారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అంతకు ముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు. ఎట్టిపరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిన్న విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన ఘటనపై పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం స్పందించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తాము ఈ ఆందోళనలు ఆపేది లేదని, ఇక్కడి నుంచి కదిలేది లేదని రాహుల్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత ఢిల్లీ పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్ బలగాలు భారీగా మోహరించి ప్రధాని నివాసం ముందు ధర్నా చేస్తున్న నేతలందరినీ అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**డిమాండ్లపై రాహుల్ మాట మార్చారు: కేంద్రమంత్రి జితేంద్రసింగ్**

డిమాండ్లపై రాహుల్‌గాంధీ మాట మార్చారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శించారు. రాహుల్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోకముందు మీడియాతో ఆయన మాట్లాడారు. "నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలని తొలుత రాహుల్ కోరారు. దానిపై హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు మాట మార్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఇలా మాట మార్చడం సరికాదు. రాహుల్ ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. యాగీ చేయడమే ఆయన ఉద్దేశం. రాజకీయ లబ్ధి కోసమే రాహుల్ ప్రయత్నిస్తున్నారు. మా ప్రభుత్వం యువతకు అన్యాయం చేయదు"అని జితేంద్రసింగ్ అన్నారు.

రాహుల్ ధీశాలి.. దేన్నైనా తట్టుకుంటారు – ప్రియాంకా గాంధీ

ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ముందు ధర్నాకు దిగిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంకా గాంధీలను పోలీసులను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ప్రియాంకా గాంధీని మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించగా.. కొన్ని గంటల అనంతరం ఆమెను విడుదల చేశారు. పోలీస్ స్టేషన్ బయట ప్రియాంక మీడియాతో మాట్లాడారు. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులతో పోలీసులు వ్యవహరించిన తీరు సరిగ్గా లేదన్నారు. "నా సోదరుడు రాహుల్ చాలా ధైర్యవంతుడు. ఆయన దేన్నైనా తట్టుకుంటారు. పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళన చేపట్టగా.. వారిని కేంద్ర ప్రభుత్వం అడ్డుకున్న తీరు సరైంది కాదు. ఆ యువతే దేశ భవిష్యత్తు. విద్యా వ్యవస్థను సంస్కరించి, పేపర్ లీక్‌లను నివారించడానికి ప్రభుత్వం ఒక బిల్లును తీసుకురావాలి. దీనిపై ప్రభుత్వం చర్చలు జరిపి, విద్యార్థుల వాదనను వినాలి. వారి ఆందోళనల్లో న్యాయం ఉంది" అని ప్రియాంకా గాంధీ పేర్కొన్నారు.

**పార్లమెంట్‌లో లేవనెత్తుతాం..**

మరోవైపు, జంతర్ మంతర్‌లో ఆందోళన చేస్తున్న వారికి కాంగ్రెస్ నేత శశిథరూర్ మద్దతుగా నిలిచారు. సోమవారం నాటి ఘర్షణలో గాయపడిన వారిని పరామర్శించిన ఆయన.. విద్యార్థుల ఆందోళనలను పార్లమెంటులో లేవనెత్తుతామన్నారు.

# ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు నాంది

కుదిరింది. ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుపై ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబుతో యూఏఈ ప్రతినిధుల బృందం చర్చలు జరిపింది. ఈ ఏడాది జనవరిలో దావోస్ పర్యటనలో ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించి యూఏఈ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆహారశుద్ధి రంగంలో ఏపీలో వ్యాల్యూ చైన్ ఏర్పాటు చేయాలని యూఏఈ నిర్ణయించింది. ఇందుకోసం ఏపీ ప్రభుత్వం- యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటు చేస్తూ ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. మామిడి, అరటి, కోకో లాంటి వివిధ ఉద్యాన ఉత్పత్తులకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, విలువ జోడించిన ఉత్పత్తుల ఎగుమతులు, వాణిజ్యం లాంటి అంశాల్లో ఈ ఎంఓయూ సహకరించనుంది. ఈ ఒప్పందంలో తొలి అడుగుగా యూఏఈకి చెందిన ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఏపీలోని చిత్తూరులో రూ.100 కోట్లను పెట్టుబడిగా పెట్టేందుకు ముందుకు వచ్చింది. చిత్తూరు జిల్లా, గంగాధర నెల్లూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్న ఈ సంస్థ ప్రపంచ శ్రేణి ఉత్పత్తులను తయారు చేయనుంది. దుబాయ్, యూఏఈ కేంద్రంగా పనిచేస్తున్న ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ దాదాపు 25 దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఏపీలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నుంచి కూడా అంతర్జాతీయ మార్కెట్లకు ఉత్పత్తులను ఎగుమతి చేయనుంది.

**క్వాంటం స్పీడ్‌తో అవకాశాలు అందుకోండి**

దావోస్ లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనపరిచిన యూఏఈ ఆరు నెలల్లోగా వాటిని సాకారం చేసే దిశగా ముందుకు వచ్చిందని సీఎం చంద్రబాబు అన్నారు. యూఏఈ ఫుడ్ క్లస్టర్ ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎగుమతులు, వాణిజ్యం, పెట్టుబడులకు ఏపీ వేదిక కావటం సంతోషదాయకమని సీఎం వ్యాఖ్యానించారు. ఉద్యాన, ఆక్వా, ఐటీ రంగాల్లో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలోని వైవిధ్యమైన వాతావరణ పరిస్థితుల కారణంగా ఏడాది పొడవునా వివిధ రకాల ఉద్యాన ఉత్పత్తులు సాగు చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. రాష్ట్ర స్థూల ఆదాయంలో 30 శాతం మేర ఉద్యాన, వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా వస్తోందని చెప్పారు. రూ. 1 లక్ష కోట్ల ప్రభుత్వం, ప్రైవేటు పెట్టుబడితో రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మారుస్తున్నామని తెలిపారు. రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్-ఐఎస్ఏను కూడా ఏర్పాటు చేయనున్నట్టు సీఎం వివరించారు. 200కు పైగా ఉద్యాన క్లస్టర్లతో అక్వా మిర్చి, పామాయిల్, కోకో, కాఫీ తదితర పంటల్లో ఏపీ ఎగుమతులు చేస్తోందని సీఎం యూఏఈ ప్రతినిధి బృందానికి వివరించారు. కృష్ణా-గోదావరి డెల్టాలో నిరంతర నీటి సరఫరా కారణంగా వ్యవసాయ ఉత్పత్తి సాధించగలుగుతున్నామని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీకి ఓ విధానంగా మారిపోయిందని తెలిపారు. ప్రగతిశీల విధానాల వల్ల దేశంలోని పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయన్నారు. పోర్టులు, రైల్వే, రోడ్డు వ్యవస్థతో ఏపీ లాజిస్టిక్స్ కేంద్రంగా మారిందని అన్నారు. ఆగస్టు 1 తేదీ నుంచి ఏపీలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం ఏపీలో అందుబాటులోకి వస్తోందని వివరించారు. విస్తృతమైన వనరులతో వివిధ రంగాల్లో విస్తృత వ్యాపార అవకాశాలను అందించేందుకు ఏపీ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి యూఏఈ బృందానికి తెలిపారు. క్వాంటం స్పీడ్ తో అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. పర్యావరణ అనుకూలంగా నిర్మిస్తున్న అమరావతిని మరో నివాసంగా మార్చుకోవాలని యూఏఈ ప్రతినిధులను సీఎం కోరారు.

**ఏపీ-యూఏఈ మధ్య ఫుడ్ కారిడార్**

కృష్ణా-గోదావరి లాంటి నదులున్న ఆంధ్రప్రదేశ్ లో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని యూఏఈ ఎకానమీ, టూరిజం విభాగం మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విజనరీ నేత సీఎం చంద్రబాబు నాయుడు అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. భారత్- యూఏఈ వాణిజ్య బంధంలో భాగంగా ఏపీలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా పని చేస్తున్నామని తెలిపారు. ఏపీలోని రొయ్యలు, అరటి లాంటి ఉద్యాన ఉత్పత్తులు వాణిజ్యంలో కీలకంగా ఉన్నాయని అన్నారు. ఏపీలో ఫుడ్ పార్క్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ చైన్ సహా వివిధ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ 21 రోజుల్లోనే అనుమతులు ఇస్తూ వాణిజ్యాన్ని, పరిశ్రమల్ని ప్రోత్సహించటం సంతోషదాయకమని ఆయన ప్రశంసించారు. అమరావతి నుంచి న్యూయార్క్ మార్కెట్ వరకూ కు డెయిరీ, పౌల్ట్రీ, సీఫుడ్ , పప్పు దినుసులు తదితర రంగాల్లో ఎగుమతులపై దృష్టి పెడతామని అన్నారు. కృష్ణపట్నం, కాకినాడ నుంచి యూఏఈకి షిప్పింగ్ రూట్లోనూ వాణిజ్యం మరింత పెరిగేందుకు సహకరిస్తామని యూఏఈ మంత్రి తెలిపారు. ఏపీ-యూఏఈల మధ్య బంధం మరింత వేగంగా బలోపేతం కావాలని ఆకాంక్షిస్తున్నట్టు అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ స్పష్టం చేశారు. ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో యూఏఈకి ఫుడ్ క్లస్టర్ చైర్మన్ సలేహ్, యూఏఈ సహాయ కార్యదర్శి మారియా అల్ ఖాసిమ్, స్పెషల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ అనూషా అల్ మర్జూఖీ, యూఏఈ ఎంబసీ నుంచి అహ్మద్ అల్ జ్నేబీ, ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, సీఎస్ సాయి ప్రసాద్ , పరిశ్రమలు, ఈడీబీ, ఆర్థికశాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పంచదార్ల కొండపై కూటమి నేతలు అక్రమ మైనింగ్

నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. 'ఛలో పంచదార్ల' పేరిట భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివచ్చి పంచదార్ల కొండలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, రీజనల్ కోఆర్డినేటర్లు కురసాల కన్నబాబు, బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ పంచదార్ల కొండల రక్షణ కోసం తాము ధర్మ పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ కలిసి ఈ కొండలను దారుణంగా దోపిడీ చేస్తున్నారని, ఇది చిన్న చిన్న వ్యక్తులు చేస్తున్న అక్రమ మైనింగ్ కాదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నిత్యం సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి పెద్దలకు కళ్లు ఉంటే ఇక్కడ జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను వచ్చి చూడాలి. ఈ ధర్మ పోరాటం ప్రజా ఉద్యమంలా మారకముందే జిల్లా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. పంచదార్ల కొండల దోపిడీపై తాము ప్రశ్నిస్తుంటే కూటమి నేతలు ఇందులో ఏదో కుట్ర దాగి ఉందని అనడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. పవిత్రమైన కొండలను దోచుకుంటున్న కూటమి నేతలకు ఆ దేవుడి పాపం తప్పక తగులుతుందని, శివుడు మూడో కన్ను తెరిస్తే ఏమవుతుందో గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. రేపటి కల్లా పంచదార్ల కొండపై మైనింగ్ వాహనాలు కనిపిస్తే అక్రమ మైనింగ్ ఆపే వరకు నడిరోడ్డుపైనే ధర్నాలు చేస్తామని, ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని బొత్స స్పష్టం చేశారు.

**భక్తుల రద్దీ.. తిరుపతిలో**

# దర్శన టోకెన్ల జారీ రద్దు

యథావిధిగా టోకెన్లు జారీ చేయనున్నారు. టోకెన్లు రద్దు చేయడం ఇది వరుసగా నాలుగోవారం కాగా సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు అవస్థలు పడుతున్నారు. బుధవారం దర్శనాలకుగాను మంగళవారం వేకువజామున ఐదుగంటలకే పదివేల సమయ నిర్దేశ (ఎస్ఎస్‌డీ) టోకెన్లు జారీ చేశారు. మెట్టు మార్గంలోని భక్తులకు మరో రెండువేల టోకెన్లు జారీ చేశారు. గంటలోపే కోటా పూర్తవడంతో వెనుక ఉన్నవారు, తరువాత వచ్చినవారు కేంద్రాల వద్దే పెద్దఎత్తున నిరీక్షించారు. ఎన్నో వ్యయప్రయాసలతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సర్వదర్శన టోకెన్లు జారీ చేయకపోవడం సరికాదంటూ విమర్శలు గుప్పించారు. అనంతరం నేరుగా తిరుమలకు పయనమయ్యారు.

# ప్రతి ఓటులో ప్రజాస్వామ్య స్పందన

మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, దాని సంస్థలు, ఎన్నికల వ్యవస్థలు సజావుగా, సమర్థవంతంగా పనిచేయడమనేది వివిధ పక్షాల చురుకైన, బాధ్యతాయుతమైన భాగస్వామ్యంపై ఆధారపడి ఉంటుందని.. ప్రజల భాగస్వామ్యమే ప్రజాస్వామ్య విజయానికి, విశ్వసనీయతకు, బలోపేతానికి నిజమైన పునాది అని పేర్కొన్నారు. మంచి అవగాహనతో సరైన నిర్ణయం తీసుకోగల ఓటరే ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లడానికి కీలకమన్నారు. తాను విద్యార్థిగా ఉన్న సమయంలో కొన్ని జిల్లాలు, ప్రాంతాల్లో పోలింగ్ శాతం 30% లేదా అంతకంటే తక్కువగా ఉండేదని.. ఆ తర్వాత అది క్రమేణా పెరుగుతూ వస్తోందని.. ఇటీవల పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో ఇది 92 శాతం దాటిందని వివరించారు. ఓటర్లలో అవగాహన, వారి భాగస్వామ్యం కోసం ఈసీఐ తీసుకున్న బలమైన చర్యలు ఈ ఫలితాలకు దోహదం చేశాయన్నారు. ఓటు వేయడం కోసం ప్రజలు తమ జీవనోపాధిని లేదా ఉద్యోగాలను వదిలి సొంత ఊళ్లకు రాకుండా, ఎన్నికల ప్రక్రియలో వారిని ఎలా భాగస్వాములను చేయాలనే దానిపై దృష్టిసారించాల్సిన అవసరముందన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్త అత్యుత్తమ విధానాల అధ్యయనం, సమాచార మార్పిడికి ఇలాంటి కార్యశాలలు ఉపయోగపడతాయని అనిల్‌చంద్ర పునేఠా పేర్కొన్నారు. ప్రసంగంలో భాగంగా స్కాండినేవియన్ దేశాల్లో ఓటర్ల ఉన్నత స్థాయి అవగాహన గురించి కూడా వివరించారు.

**అక్షరక్రమంలోనే కాదు.. పోలింగ్ శాతంలోనూ ముందుండాలి: రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ ఎన్.రమేష్ కుమార్**

అక్షరక్రమంలోనే కాదు.. పోలింగ్ శాతంలోనూ ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ ముందుండాలని ప్రత్యేక అతిథి, రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ అన్నారు. ఓటు హక్కు కేవలం హక్కు మాత్రమే కాదని.. అది బాధ్యత కూడా అని, విశిష్టమైన ఓటు హక్కు గురించి యువత తెలుసుకొని, అందరికీ తెలియజేయాలని అన్నారు. పొరుగు దేశాలతో చూస్తే మన భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా ఉందని.. ఇందుకు ప్రధాన కారణం ఎలక్షన్ కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తితో, విచక్షణతో పనిచేయడమేనని పేర్కొన్నారు. ఓటు హక్కు అనేది రాజ్యాంగపరంగా లభించిన హక్కు అని.. దాన్ని బాధ్యతాయుతంగా భావించాలి, గౌరవించాలి, గుర్తించాలి, వ్యవహరించాలని.. అలా లేనప్పుడు అది బాధ్యతారాహిత్యమే అవుతుందన్నారు. కీలమైన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్)కు సంబంధించి బీఎల్‌వోలకు సరైన శిక్షణ అందించి, వారి బాధ్యతను గుర్తుచేస్తూ ఇక్కడి కలెక్టర్లు ముందుకు తీసుకెళ్లడం హర్షణీయమని రమేష్ కుమార్ పేర్కొన్నారు. చట్టపరంగా వచ్చే హక్కులు, రాజ్యాంగ పరంగా వచ్చే హక్కులు, ప్రాథమిక హక్కులు గురించి వివరించడంతో పాటు ఓటు హక్కుకు సంబంధించి వివిధ కేసుల గురించి ఆయన వివరించారు.

**సమ్మిళిత ప్రపంచం కోసం ప్రజాస్వామ్యం: ఏపీ సీఈవో వివేక్ యాదవ్**

రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) వివేక్ యాదవ్ మాట్లాడుతూ భారత్ ఈ ఏడాది ఇంటర్నేషనల్ ఐడియా కౌన్సిల్ బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు మన రాష్ట్రం ఈ కీలకమైన అధ్యయన బాధ్యతను చేపట్టినట్లు తెలిపారు. సమ్మిళిత, శాంతియుత, స్థితిస్థాపక, సుస్థిర ప్రపంచం కోసం ప్రజాస్వామ్యం అనే ప్రధాన ఇతివృత్తంతో ఇంటర్నేషనల్ ఐడియాకు భారత్ అధ్యక్షత వహిస్తున్నట్లు వివరించారు. ఓటర్ల అర్హత అంశంపై 9-సోపానాల ద్వారా క్షేత్రస్థాయి అధ్యయనం చేసి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో వినియోగించేలా నమూనా ప్రమాణాలను రాష్ట్రం రూపొందిస్తోందని పేర్కొన్నారు. అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించి, 18 ఏళ్లు నిండిన అర్హులందరికీ ఓటు హక్కు కల్పించి పారదర్శకమైన, లోపరహితమైన ఓటర్ల జాబితాను తయారు చేయడమే ఎస్ఐఆర్ లక్ష్యమని తెలియజేస్తూ కార్యక్రమం ప్రగతిని సీఈవో వివేక్ యాదవ్ వివరించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనేది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి గొప్ప అవకాశమని పేర్కొన్నారు. సార్వజనీన ఓటు హక్కుతో పాటు ఆటోమేటిక్ రిజిస్ట్రేషన్, ప్రాంతం మారినప్పుడు ఆటోమేటిక్ షిఫ్టింగ్, రాజకీయ పార్టీలలో నమ్మకం సాధించడం అనేవి ఆదర్శవంతమైన ఓటర్ల జాబితాకు ముఖ్య సూత్రాలన్నారు. స్వచ్ఛందంగా ఆధార్ అనుసంధానం వల్ల భవిష్యత్తులో డిజిటల్ డేటా ఆధారంగా తప్పులు లేని, స్వయంచాలకంగా నమోదయ్యే ఓటర్ల జాబితాను తయారు చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ముగింపు ఉపన్యాసమిస్తూ.. ఓటర్ల జాబితాలో నమోదు అనేది కేవలం పరిపాలనాపరమైన పని మాత్రమే కాదని, అది ఒక రాజ్యాంగ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా పవిత్రతను కాపాడేందుకు చట్టపరమైన కచ్చితత్వంతో పాటు మానవతా దృక్పథం అవసరమని, అలాగే అకడమిక్ పరిశోధనలు క్షేత్రస్థాయి అధికారుల ప్రత్యక్ష అనుభవాలు అత్యుత్తమ విధానాల రూపకల్పనకు దోహదం చేస్తాయని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు, అధికారులు, భాగస్వామ్య సంస్థలకు అభినందనలు తెలియజేస్తూ, ఈ వర్క్‌షాప్ ద్వారా వచ్చిన సూచనలు భవిష్యత్ ఎన్నికల సంస్కరణలకు, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరచడానికి ఎంతగానో ఉపయోగపడతాయని ఆకాంక్షిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు. కార్యశాలలో పలు కీలక అంశాలతో టెక్నికల్ సెషన్లు జరిగాయి. కంపేరిటివ్ లీగల్ ట్రెడిషన్స్, ఫ్రాంఛైజ్ క్వాలిఫికేషన్స్, గ్లోబల్ బేస్‌లైన్స్, అంతర్జాతీయ అత్యుత్తమ విధానాలు, ఓటర్ల అర్హతకు సంబంధించి గ్లోబల్ స్టాండర్డ్స్, ఇంటర్నేషనల్ డేటా మోడల్స్ తదితర అంశాలపై వివిధ యూనివర్సిటీల ప్రముఖులు, ఐఐఐడీఈఎం, ఐడీఈఏ ప్రతినిధులు తదితరులు పవర్ పాయింట్ ప్రజంటేషన్స్ ఇచ్చారు. ప్రశ్న-సమాధానాల సెషన్లతో మేధోమథన చర్చ జరిగింది.

## వైకాపా మాజీ ఎమ్మెల్యే అనిల్‌పై కేసు నమోదు

ఫిర్యాదు మేరకు అనిల్‌తో పాటు మరికొందరు వైకాపా నేతలపై 126(2), 221 రెడ్‌విత్ 190 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అనిల్, వైకాపా నేతలు.. సోషల్ మీడియా ఫిర్యాదుతో స్టేషన్‌కు వచ్చి రచ్చ చేసిన విషయం తెలిసిందే.

# కేంద్రానికి వినతి

ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముడి పొగాకుపై పన్ను శాతాన్ని తగ్గిస్తే గిట్టుబాటు ధర లభించడంతో పాటు వ్యవసాయ రంగానికి ఊరట కలుగుతుందని తెలిపారు. ఈ విజ్ఞప్తి కేవలం ముడి పొగాకుకు మాత్రమే సంబంధించినదని, తయారైన పొగాకు ఉత్పత్తులకు వర్తించదని స్పష్టం చేశారు. పన్ను తగ్గింపు వల్ల భారత ముడి పొగాకు ఎగుమతులకు అంతర్జాతీయ మార్కెట్లో పోటీతత్వం పెరిగి విదేశీ మారకద్రవ్యం ఆర్జనకు కూడా దోహదపడుతుందని వివరించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోరగా, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు.

# ఐదేళ్లలో జరిగిన భూ అక్రమాలపై చర్యలు

అసత్య ఆరోపణలు చేస్తోందని మంత్రి ఆరోపించారు. తమ్మినేని భూ అక్రమాలతో పాటు గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు భూమిపై చట్టవిరుద్ధంగా వ్యవహరించిన వారిపైనా చర్యలు ఉంటాయన్నారు. గత 5 ఏళ్లలో జరిగిన అన్ని అక్రమాలపై చర్యలు ఉంటాయని మంత్రి అనగాని స్పష్టం చేశారు.

# అంబటి వ్యాఖ్యలకు నిరసన

ఎంఎస్‌పీ నాయకులు వల్లూరి సత్తిబాబు, అనంతవరపు రాజు, పలివెల నవీన్, తుమ్మలపల్లి సంతోష్‌కుమార్, కింతాడ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి

అణచివేయాలని ప్రయత్నించినా ఉద్యమాన్ని ఆపలేరన్నారు. కోట్లాది మంది యువత ఆగ్రహాన్ని అణచివేయడం సాధ్యం కాదని.. న్యాయం, జవాబుదారీతనం కోసం యువత చేస్తున్న పోరాటం కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# యూకేలో తొలి ఏఐ మంత్రిగా భారతీయుడు

ఏఐ మంత్రిగా నియమితులయ్యారు. విధానాల రూపకల్పనలో ఏఐకి మరింత కీలకపాత్ర ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. ఆయన బిహార్‌లో జన్మించారు. ఆయన లింక్డిన్ ప్రొఫైల్ ప్రకారం.. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో తత్వశాస్త్రం, రాజకీయాలు, ఆర్థికశాస్త్రంలో విద్యనభ్యసించారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. 2024 ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించారు. 2025లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

**బెంగాల్‌లో లీసా మూలాలు..**

లీసా నాండీ మాంచెస్టర్ నగరంలో జన్మించారు. ఆమె తండ్రి దీపక్ నాండీది పశ్చిమ బెంగాల్. తల్లి బ్రిటిష్ జాతీయురాలు. 2010 నుంచి విగాన్ నియోజకవర్గానికి ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

# రష్యా దౌత్యవేత్తకు భారత్ సమన్లు

ఖండించదగిన చర్యలని విదేశాంగ శాఖ పేర్కొంది. నౌకలే లక్ష్యంగా చేసే దాడులు అంతర్జాతీయ సముద్ర వాణిజ్య భద్రత, స్థిరత్వానికి తీవ్ర ముప్పుగా మారతాయని విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుత పరిస్థితులను ఉక్రెయిన్‌లోని భారత కమిషన్ నిశితంగా పర్యవేక్షిస్తోందని.. బాధితులకు సాయం చేయడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తోందని తెలిపింది.

**ఏమయ్యిందంటే..?**

ఉక్రెయిన్‌లోని ఒడెస్సా ఓడరేవు నుంచి బయల్దేరిన ఎంవీ గోల్డెన్ లియో అనే నౌకపై దాడులు జరిగినట్లు ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సైబిహా ఇటీవల వెల్లడించారు. తమ జలాల్లోని నౌకపై రష్యా చేసిన దాడిలో పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. ప్రమాద సమయంలో సిరియా, భారత దేశానికి చెందినవారు అందులో ఉన్నారన్నారు. ఈ దాడుల్లో నలుగురు భారత నావికులు మృతిచెందగా.. మరొక భారతీయుడి పరిస్థితి విషమంగా ఉందని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ధ్రువీకరించింది.

# ఎడిటర్ వాయిస్

## స్వర్ణయుగంలో ఆ నలుగురు ఎంట్రీ.. తర్వాత ఏమి జరిగింది?

తెలుగు రాజకీయాల్లో స్వర్ణయుగం అనదగిన కాలం ఒకటి నడచింది. ఒక విధంగా అది అప్పటి పాత తరం కొత్త తరం రాజకీయాలకు సంధి యుగం అని కూడా చెప్పుకోవాల్సి ఉంది. ఇంతకీ ఆ గోల్డెన్ యుగం ఏమిటి అంటే 1978 వ సంవత్సరం. ఈ ఇయర్ పొలిటికల్ గా తెలుగు వారికి ఎంతో గుర్తుండిపోయేదిగానే చెప్పాల్సి ఉంటుంది. ఈ ఏడాదిలో ఎంతో మంది యువ నేతలు రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అందులో అత్యధికులు రాజకీయంగా సక్సెస్ లను అందుకున్నారు. కొందరు అయితే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. అంతకు ముందు తరం అంతా స్వాతంత్ర్య పోరాటం నుంచి వచ్చిన వారిది అయితే ఈ తరానిది కొత్త దశ దిశ రాజకీయాలకు తమ ప్రాంతానికి ఇచ్చే కీలక పాత్ర అని చెబుతారు.

**తొలిసారి ఎమ్మెల్యేలుగా :** ఇక 1978లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కి జరిగిన ఎన్నికలలో చాలా మంది కొత్త నేతలు ఎంట్రీ ఇచ్చారు. అలా చూస్తే ప్రస్తుతం ఏపీకి నాలుగవ సారి సీఎం గా వ్యవహరిస్తున్న చంద్రబాబు చిత్తూరు జిల్లా చంద్రగిరి నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఇందిరా కాంగ్రెస్ నుంచి గెలిచి నవ యువ ఎమ్మెల్యే అయ్యారు. అలాగే రెడ్డి కాంగ్రెస్ నుంచి ఫస్ట్ టైం పొలిటికల్ గా బరిలోకి దిగి పులివెందుల నుంచి ఎమ్మెల్యే అయిన వారు వైఎస్ రాజశేఖర్ రెడ్డి. అదే విధంగా నెల్లూరు జిల్లా ఉదయగిరి నుంచి తొలిసారి జనతా పార్టీ తరపున ఎమ్మెల్యే అయిన వారు ఎం వెంకయ్యనాయుడు. వీరితో పాటే మరో కీలక నేత కూడా అదే ఏడాది ఫస్ట్ టైం ఎమ్మెల్యే అయ్యారు. ఆయనే ఇటీవల దివంగతులు అయిన ముద్రగడ పద్మనాభం. ఆయన కూడా జనతా పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. చిత్రమేంటి అంటే ఆనాడు మొత్తం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి జనసేన తరపున గెలిచిన ఏకైక ఎమ్మెల్యే ఆయనే కావడం. ఇక వీరందరి వయసు కూడా దాదాపుగా ఒక్కటే. బాబు 28 ఏళ్ళకు ఎమ్మెల్యే అయితే వైఎస్సార్, వెంకయ్యనాయుడు 29 ఏళ్ళకు ఎమ్మెల్యేలు అయ్యారు. ముద్రగడ పాతికేళ్ళకే ఎమ్మెల్యే అయి అందరి కన్నా పిన్న వయసుగా నిలిచారు.

**కీలక స్థానాల్లోకి :** ఇక చంద్రబాబు వైఎస్సార్ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో తొలిసారి యువ మంత్రులుగా బాధ్యతలు నిర్వహించి తమ సత్తా చూపారు. ఆ తరువాత వైఎస్సార్ 35 ఏళ్ళకే పీసీసీ చీఫ్ గా అయ్యారు. చంద్రబాబు టీడీపీలో చేరి ఆ పార్టీలో కీలక నేతగా ఎదిగారు. వెంకయ్య నాయుడు బీజేపీలో ముఖ్య పదవులు చేపట్టి రాష్ట్ర అధ్యక్షుడు అయ్యారు. ముద్రగడ అయితే కాపునాడు సభ ద్వారా 1989 నాటికి ఏపీలోనే అతి ముఖ్య నేతగా మారిపోయారు. అయితే అదే టెంపోని పొలిటికల్ దూకుడుని మిగిలిన ముగ్గురూ కంటిన్యూ చేయగలిగారు అన్న విశ్లేషణలు ఉన్నాయి. చంద్రబాబు 1995లో ముఖ్యమంత్రి అయితే వైఎస్సార్ 2004లో సీఎం అయ్యారు. వెంకయ్య నాయుడు 1998లో కేంద్ర మంత్రి అయ్యారు. ఆ తరువాత బీజేపీలో జాతీయ అధ్యక్షుడు అయి ఉప రాష్ట్రపతి దాకా ఎదిగారు.

**ముద్రగడ సైతం :** అయితే ముద్రగడకు కూడా ఈ ముగ్గురు నేతలకు ఉన్న సామర్థ్యం ఇమేజ్ సత్తా అన్నీ ఉన్నాయి. కానీ ఆయన పట్టుదల గల మనిషి కావడం రాజీలేని ధోరణిలో ముందుకు సాగడం వల్లనే ఆయన మిగిలిన వారి మాదిరిగా ఉన్నత శిఖరాలకు చేరుకోలేకపోయారు అన్న వెలితి బాధ అయితే అభిమానులలో ఉంది. ఆయన పేరు 1989 నుంచి 1994 మధ్యలో ఉమ్మడి ఏపీ సీఎం పదవికి ప్రస్తావనకు వచ్చింది కానీ అది సాకారం కాలేదని చెబుతారు. పైగా ముద్రగడ పదవీ రాజకీయాలకు దూరంగా ఉంటూ రావడం వల్ల కూడా అందలాలు అందుకోలేకపోయారు అని అంటారు. ఏది ఏమైనా మిగిలిన ముగ్గురు నేతల మాదిరిగా ముద్రగడ కూడా ప్రజా నాయకుడిగా ఏపీ రాజకీయాలలో దిగ్గజ నేతగా తన పేరుని చిరస్థాయిగా చేసుకున్నారని అంటారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## మీర్‌పేట్‌లో రౌడీ షీటర్ సూరి దారుణ హత్య



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్ నందనవనం సూరి దారుణ హత్యకు గురయ్యాడు. గతంలో తన భార్య, బావమరిది సల్మాన్ హత్య కేసుల్లో నిందితుడైన సూరిపై వరంగల్, హైదరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్‌ల పరిధిలో పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అతనిపై నగర బహిష్కరణ కూడా అమల్లో ఉన్నట్లు సమాచారం. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. తన రెండో భార్య తమ్ముడి పుట్టినరోజు వేడుకలకు సూరి నందనవనానికి వచ్చాడు. సూరి అక్కడికి వచ్చిన విషయం తెలుసుకున్న అఫ్రోజ్ (సల్మాన్ సోదరుడు)అక్కడికి చేరుకుని.. సూరి కళ్లలో పెప్పర్ స్ప్రే చల్లి, అనంతరం కత్తితో విచక్షణారహితంగా దాడి చేసినట్లు సమాచారం. తీవ్ర గాయాలపాలైన సూరిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మీర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వజ్రాన్ని నోటిలో దాచి.. చోరీ చేసి

### సింగపూర్‌లో భారతీయుడికి రెండేళ్ల జైలు

**విశ్వం వాయిస్ న్యూస్ :** సింగపూర్‌లోని ఓ నగల దుకాణంలో వజ్రం దొంగతనం చేసిన కేసులో ఇద్దరు భారతీయుల్లో ఒకరికి జైలు శిక్ష పడింది. మనోజ్‌కుమార్ కుర్జీభాయ్ అనే వ్యక్తికి కోర్టు 2 ఏళ్ల శిక్ష విధించింది. మరో నిందితుడు సెరాసియా మిలన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా వేసింది. వీరిద్దరూ ఓ స్నేహితుడి ద్వారా పరిచయమయ్యారు. సింగపూర్‌కు వెళ్లే ముందే అక్కడ దొంగతనానికి ప్రణాళిక వేశారు. ఈ క్రమంలో అసలు వజ్రాన్ని పోలి ఉండే నకిలీ వజ్రాన్ని సూరత్‌లో తయారు చేయించారు. జూన్ 19న సింగపూర్ చేరుకున్న వీరు చైనాటౌన్‌లోని ఓ వజ్రాల దుకాణానికి వెళ్లారు. అక్కడ పలు వజ్రాలను చూడాలని కోరారు. సేల్స్ మేనేజర్ దృష్టి మరల్చి.. అసలు వజ్రాన్ని కొట్టేసి.. నకిలీది అక్కడ పెట్టారు. అసలు (రూ.1.82 కోట్ల విలువైన) వజ్రాన్ని మిలన్ నోటిలో దాచుకుని బయటకు వచ్చాడు. ఆ తర్వాత సేల్స్ మేనేజర్ అనుమానంతో వజ్రాన్ని పరీక్షించగా అది నకిలీదని తేలింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇద్దరూ అదే రోజు సాయంత్రం భారత్‌కు వచ్చేందుకు విమానాశ్రయానికి చేరుకున్నారు. పోలీసులు తనిఖీలు చేసి.. మిలన్ బ్యాగ్‌లో నుంచి అసలు వజ్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ నేరం ముందస్తు ప్రణాళికతో జరిగిందని ప్రాసిక్యూషన్ కోర్టుకు తెలిపింది.

## కబళించిన మృత్యువు... ట్రాలీ ఆటో ఢీకొని చిన్నారి మృతి

**ఆలేరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అప్పటి వరకు సంతోషంగా ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిని ఆటో రూపంలో మృత్యువు కబళించింది. కన్నపేగును కాపుడుకుందామని తల్లిదండ్రులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆసుపత్రికి చేర్చగా చికిత్స అందేలోగా లోకాన్ని వీడి వెళ్లిపోయింది మూడేళ్ల చిన్నారి. కుటుంబ సభ్యులు, ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకకు చెందిన శ్రీరాముల కరుణాకర్, కీర్తన దంపతులకు శ్రీహన్సిక(3) రెండో సంతానం. కరుణాకర్ వృత్తిరీత్యా గ్రామంలో హెయిర్ సెలూన్‌ను నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో శ్రీహన్సిక ఇంటిముందు సీసీ రోడ్డుపై ఆడుకుంటున్న క్రమంలో అటు నుంచి వచ్చిన ఖాళీ ట్రాలీ ఆటో ఢీకొట్టింది. కింద పడ్డ చిన్నారిపై నుంచి వెనుక చక్రం వెళ్లిపోయింది. అక్కడున్నవారు వెంబడించి డ్రైవర్‌ను పట్టుకున్నారు. చిన్నారిని ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అవసరమని వైద్యులు చెప్పడంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తుండగానే చిన్నారి తుదిశ్వాస విడిచింది. ట్రాలీ ఆటో డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడని, అక్రమంగా ఇసుకను అన్‌లోడ్ చేసి వస్తున్న క్రమంలో ఈ ఘటన జరిగిందని స్థానికులు ఆరోపించారు. నిందితున్ని కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు ఆలేరు పోలీస్ స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు.

## బాచుపల్లి వద్ద రోడ్డు ప్రమాదం : ముగ్గురి మృతి



**కల్హేర్, విశ్వం వాయిస్ న్యూస్ :** సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం బాచుపల్లి వద్ద తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో నాలుగేళ్ల చిన్నారి సహా ముగ్గురు మృతి చెందారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. విదేశాల నుంచి వస్తున్న బంధువును తీసుకొచ్చేందుకు నాందేడ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. క్షతగాత్రులను నారాయణఖేడ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కల్హేర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఠాణాలో భార్యపై కత్తితో దాడి

**ఏన్కూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఖమ్మం జిల్లా ఏన్కూరు ఠాణాలో తనపై ఫిర్యాదు చేస్తున్న భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎర్రబోడు తండాకు చెందిన భూక్యా రాంబాబుకు 16 ఏళ్ల క్రితం కామేపల్లి మండలం సాతానిగూడేనికి చెందిన రజినితో వివాహమైంది. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు, మనస్పర్థలు కారణంగా గత కొన్ని నెలలుగా ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. సోమవారం ఏన్కూరు ఎస్‌బీఐలో రజిని డ్వాక్రా చెల్లింపుల కోసం వచ్చారు. విషయం తెలుసుకున్న రాంబాబు అక్కడికి చేరుకుని ఆమెతో వాగ్వాదానికి దిగాడు. ఆ ప్రాంతంలో కొంత అలజడి కావడంతో బ్యాంకు అధికారులు 112కు ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని రజినిని ఠాణాకు తీసుకెళ్లారు. బ్యాంకులో చోటు చేసుకున్న వాగ్వాదం గురించి ఆమె పోలీసులకు ఫిర్యాదు చేస్తుండగా రాంబాబు ఒక్కసారిగా ఠాణాలోకి వచ్చాడు. తనతో తెచ్చుకున్న కత్తితో భార్య చేతిపై రెండుచోట్ల పొడిచి గాయపరిచాడు. అప్రమత్తమైన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. రక్తస్రావంతో ఉన్న రజినిని పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స అనంతరం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై సంధ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీకే దిన్నె పూర్వ తహసీల్దార్‌పై క్రిమినల్ కేసు

**కడప, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కడప జిల్లా సీకే దిన్నె కేంద్రంగా జరిగిన భూ అక్రమాల వ్యవహారంలో నాటి తహసీల్దార్, ప్రస్తుతం నెల్లూరు జీజీహెచ్ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ బి.మహేశ్వర్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదైంది. పక్కా ప్రణాళికతో ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో ఆయనపై బీఎన్‌ఎస్ 420 (మోసం), 409 (ప్రభుత్వ ఉద్యోగి నమ్మకద్రోహం) సెక్షన్ల కింద సీకే దిన్నె పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మహేశ్వర్‌రెడ్డి సీకే దిన్నె తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో చుక్కల భూముల చట్టం, 22-ఏ జాబితాలో ఉన్న సుమారు 15.94 ఎకరాల ప్రభుత్వ భూములను జాబితా నుంచి తొలగించేందుకు తప్పుడు రికార్డులు సృష్టించారు. వాటితో జిల్లా యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టిస్తూ క్రమబద్ధీకరణ ప్రతిపాదనలు పంపి, ఆయా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేలా ఉత్తర్వులు పొందేలా చేశారు.




# విశ్వవాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




బుధవారం, 22 జూలై, 2026

4

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత

www.viswamvoice.com


## ప్రపంచంలో విద్యకు మించిన సంపద లేదు : ఎమ్మెల్యే శిరీష దేవి

**2026విద్యా సంవత్సరంలో 10, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ పరులకు ప్రోత్సాహకాలు అందించిన ఎమ్మెల్యే శిరీషాదేవి, కలెక్టర్ దినేష్ కుమార్**

**67 మంది విద్యార్థులకు రూ:20,000/- లు చొప్పున చెక్కు ప్రశంసా పత్రం, మెడల్స్ అందించిన ఎమ్మెల్యే శిరీషాదేవి**

**షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ -2026 విద్యార్థులతో కలిసి భోజనాలు చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్, సంయుక్త కలెక్టర్**



**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్యే అని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రంప చోడవరం సమీకృత గిరిజనా భివృద్ధి సంస్థ సమావేశపు మందిరంలో మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో గత విద్యా సంవత్సరంలో అద్భుతమైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ దినేష్ కుమార్ సౌజన్యం లో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ విద్య కు మించిన సంపద మరొకటి లేదన్నారు. విద్య నేర్చుకుని పాడైపోయిన వారు లేరన్నారు. షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ - 2026 2026 విద్యా సంవత్సరంలో 10 వ తరగతి ఫలితాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచి, మంచి మార్కులు సాధించిన జిల్లా వ్యాప్తంగా 52 మంది విద్యార్థులకు, 15 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆమె, కలెక్టర్ దినేష్ కుమార్ చేతులు మీదుగా ఒక్కో విద్యార్థికి రూ:20,000/- లు చెక్కులు అందించారు. అలాగే ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. విద్యార్థులు నగదును ఉన్నత చదువులకు ఉపయోగించుకోవాలని కోరారు. మంచి తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులను ప్రశంసించారు. విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించి మరిన్ని విజయాలు సాధించేలా ప్రోత్సాహకాలు అందించాలన్నారు. ప్రభుత్వం గతంలో లేనంతగా ప్రభుత్వ విద్య వ్యవస్థ లో విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇలాంటి ప్రోత్సాహకాలు మరింత ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని అందిస్తాయ న్నారు. అనంతరం ఆమె, కలెక్టర్, సంయుక్త కలెక్టర్ తదితర జిల్లా అధికారులు విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

**నవ జంట కానుక పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే శిరీషాదేవి, కలెక్టర్ దినేష్ కుమార్**

ప్రభుత్వం చేపట్టే నవజంట కానుక పథకాన్ని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, కలెక్టర్ దినేష్ కుమార్ లు ప్రారంభించారు. ఐటిడిఎ సమావేశపు మందిరంలో మంగళవారం దీనికి సంబంధించిన బ్రోచర్ ను విడుదల చేశారు. అలాగే ఆయా వివరాల కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 18004254225 ను అధికారికంగా ప్రారంభించారు. దీనిని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు గొర్లె సునీత, జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేడ్కర్, గిరిజన సంక్షేమ శాఖ విద్యా విభాగం ఉప సంచాలకులు రుక్మంగదయ్య, బంధం శ్రీదేవి, పండా వెంకటలక్ష్మి , విద్యాశాఖ ప్రతినిధి ఈశ్వర రావు, పలువురు జిల్లా ఆ స్థాయి అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు గణజాల తాతారావ్ , విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రంపచోడవరం ఐటిడిఏలో కంట్రోల్ రూం ఏర్పాటు

**జిల్లాలో ప్రకృతి విపత్తులకు సంబంధించిన సమస్యలు ఎక్కడైనా ఉంటే సంప్రదించవలసిన టోల్ ఫ్రీ నెంబర్ - 18004254225**



**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లాలో పకృతి వైపరీత్యాలకు సంబంధించిన సమస్యలను తెలుసుకునే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో పకృతి వైపరీత్యాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు సంబంధించిన వాల్ పోస్టర్ను పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, రంపచోడవరం శాసనసభ్యులు, లెజిస్లేటివ్ చైర్మన్ మిరియాల శిరీష దేవి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె. సునీత ,జిల్లా రెవిన్యూ అధికారి పి. అంబేద్కర్, ఎంపీపీ శ్రీమతి బంధం శ్రీదేవి, జడ్పిటిసి శ్రీమతి పండ వెంకటలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలో ఈ సంవత్సరం వరదలు ఎదుర్కొనే విధంగా ఎక్కడికి అక్కడ ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసి పోలవరం జిల్లాలోని రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఎప్పుడైనా ప్రకృతి విపత్తులకు సంబంధించిన సమస్యలు ఎక్కడైనా ఉన్నాయెడల వెంటనే 18004254225 గల టోల్ ఫ్రీ నెంబర్ కు సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. పోలవరం జిల్లాలో భారీ వర్షాలు, వరదలు, కొండ చరీయలు విరిగిపడడం, రహదారులు దెబ్బలు తినడం, విద్యుత్ అంతరాయం అదేవిధంగా ఇతర అత్యవసర పరిస్థితులు ఉన్న యెడల వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ కు సంప్రదించగలరని ఆయన తెలిపారు. పకృతి వైపరీత్యాలకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులతో తక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ చంద్రశేఖర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డీఈవో జి.శ్రీరామ్ మూర్తి, డిఐ ఓ కరుణారావు, ఎస్ఎస్సి అధికారి భాస్కర్ రావు,జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.ఉమా, డాక్టర్ నీలిమ, చిన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో కోయ భాష

**పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది**

**కోయ భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలి : ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్**



**గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాతృభాషా ఆదరణ తగ్గి నేడు కోయ భాష తీవ్రమైన ప్రమాదంలో పడిందని, భాషను కోల్పోతే మన సాంస్కృతిక ఉనికిని, హక్కులను కోల్పోయినట్లేనని ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఏఎస్పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వ గోండి/ కోయ భాషా దినోత్సవం సందర్భంగా గంగవరం మండల కేంద్రంలో పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కుంజా శ్రీను మాట్లాడుతూ కోయ భాష కేవలం ఒక మాట్లాడే మాధ్యమం మాత్రమే కాదని, అది కోయ ఆదివాసీల వేలాది సంవత్సరాల చరిత్రకు, జీవన విధానానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరుల వలసలు పెరగడం, ఉద్యోగ, ఉపాధి;రీత్యా, బయట స్థిరపడిన ఆదివాసీలు మాతృభాషకు దూరమవ్వడం వల్ల ఈ భాష కనుమరుగయ్యే పరిస్థితి దాపురించిందన్నారు.

**భాషా పరిరక్షణపై పిలుపు**

సొంత భాషలో మాట్లాడటానికి ఎవరూ అస్సలు నామోషీ పడకూడదని, మన భాషలో మాట్లాడటమే మనకు అసలైన గర్వకారణమని కుంజా శ్రీను ఆదివాసీ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రచార ఆర్భాటాలు, ఆధునికత పేరుతో మన మాతృభాషను ఇంట్లోనే మర్చిపోతే, భవిష్యత్తు తరాలకు మనం ఏమీ అందించలేమని హెచ్చరించారు. "మన ఇళ్లలో, పండగల్లో, ఊరి రచ్చబండల వద్ద పిల్లలతో, కుటుంబ సభ్యులతో తప్పనిసరిగా కోయ భాషలోనే మాట్లాడదాం. ఇతర భాషలను నేర్చుకుంటూ వాటిని గౌరవిద్దాం... కానీ మన సొంత భాషను ప్రాణంగా కాపాడుకుందాం" అని చైతన్యపరిచారు.

**ప్రభుత్వానికి డిమాండ్లు**

అంతరించిపోతున్న కోయ భాషకు చట్టభద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే దీనిని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఆదివాసీ పిల్లలకు కోయ భాషలోనే ప్రాథమిక విద్యాబోధన అందించేలా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు తీగల బాబురావు, తెల్లం శేఖర్, యాళ్లగడ్డ నాగేశ్వరరావు, రామన్న దొర, చోడి ప్రదీప్ కుమార్ దొర, కంగాల అబ్బాయి దొర, పీఠ ప్రసాద్, అరుణకుమారి, దుర్గ భవాని, పరదా శివరామకృష్ణ, కలుమల ప్రసాద్ దొర, చోడి ఏడుకొండలు రావు దొర, కోటం రాజన్న దొర తదితరులు పాల్గొన్నారు.

**జిల్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాక సందర్భంగా**

## అడ్డతీగలలో సన్నాహక సమావేశం



**అడ్డతీగల, విశ్వంవాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా అడ్డతీగల మండలం బీజేపీ మండల అధ్యక్షులు కురసం రాజబాబు ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కోసూరి కాశి వీర వెంకట సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఈ నెల 28న రంపచోడవరం పర్యటన ఉన్న నేపథ్యంలో మండల కమిటీ పూర్తి చేయాలని, మోర్చ కమిటీలు పూర్తి చేయాలని అందరు కలిసి రావాలి అని మాజీ ఎమ్మెల్యే,మండల ఇంచార్జి కోసూరి కాశి వీర వెంకట సత్యనారాయణ రెడ్డి దిశ నిర్దేశం చేశారు. అదే రోజు బిఎల్ఏ2లతో నియోజకవర్గ స్థాయి సమావేశం ఉంటుంది అని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఈరోజి స్వప్న కుమారి, విష్ణుమూర్తి, రాజుబాబు, పువ్వరాగం, చంద్రరావు, రమేష్, నూకరాజు, రాజరెడ్డి, బిఎల్ఏ2 లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ పోలవరం జిల్లా 12 మండలాల ఇన్‌చార్జ్‌ల నియామకం

**జిల్లా అధ్యక్షులు బుల్లికొండలు దొర**



**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ పోలవరం జిల్లా పార్టీ సంస్థాగత బలోపేతం, మండల స్థాయిలో పార్టీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు 12 మండలాలకు ఇన్‌చార్జ్‌లను నియమించడం జరిగిందని పోలవరం జిల్లా బీజేపీ అధ్యక్షులు ఈకా బుల్లికొండలు దొర తెలిపారు. నియమితులైన మండల ఇన్‌చార్జ్‌లు ఆయా మండలాధ్యక్షులతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు విస్తరించేందుకు, పార్టీ బలోపేతానికి, సభ్యత్వ విస్తరణకు, ప్రజా సమస్యలపై పోరాటాలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజాహిత కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తారు. అలాగే నూతనంగా నియమితులైన మండల ఇన్‌చార్జ్‌లందరికీ భారతీయ జనతా పార్టీ పోలవరం జిల్లా తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

**నియమితులైన మండల ఇన్‌చార్జ్‌లు:**

ఎటపాక మండలం నోముల రామారావు, కూనవరం మండలం: డి.వి.రమణారెడ్డి, వి.ఆర్.పురం మండలం: నామాల శ్రీనివాసు, చింతూరు మండలం: పాయం వెంకయ్య, మారేడుమిల్లి మండలం: కె.ఎల్.ఎన్. గురుప్రసాద్, దేవీపట్నం మండలం: కారం సీతారామన్న దొర, రంపచోడవరం మండలం: కుంజం వెంకటేశ్వర్లు, గంగవరం మండలం: కుండ్ల కృష్ణారెడ్డి, అడ్డతీగల మండలం:కె.వి.వి. సత్యనారాయణ రెడ్డి, రాజవొమ్మంగి మండలం:కుంజం సత్యనారాయణమ్మ, వై.రామవరం మండలం:ఈరోజు స్వప్న కుమారి, గుర్తేడు మండలం:ముర్ల బాలురెడ్డి.

## ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ



**దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలం శరభవరం రైతు భరోసా కేంద్రం వద్ద భారతీయ జనతా పార్టీ మండల ఉపాధ్యక్షులు తుర్రం సుబ్బారావు ఆధ్వర్యంలో యూరియ పంపిణీ చేయడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులకు బయోమెట్రిక్ విధానం గురించి తెలిపారు. పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న భారతీయ జనతా పార్టీ మండల ఉపాధ్యక్షులు తుర్రం సుబ్బారావు మాట్లాడుతూ,యూరియా పంపిణీ విధానంలో రైతులు కు ఎటువంటి అవకతవకలు జరగకుండా సంబంధిత అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్, రైతులు, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**పోలవరం జిల్లా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో**

## వైసీపీ నేత అంబటి రాంబాబు దిష్టిబొమ్మ దగ్ధం

**హోంమంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత మాటలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్**



**విఆర్ పురం/రాజవొమ్మంగి, విశ్వంవాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా విఆర్ పురం మండల కేంద్రంలో వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలను అనుసరించి ఉమ్మడి అల్లూరి జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి మోర్తా బుజ్జి బాబు పర్యవేక్షణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ను ఉద్దేశించి ఎమ్మార్పీఎస్ నాయకులు అంబటి రాంబాబుని బేషరతుగా క్షమాపణ చెప్పమని ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోమని హెచ్చరించడం జరిగింది. తదనంతరం అంబటి రాంబాబు దిష్టిబొమ్మను తగలబెట్టడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నాయకులు మోదుగ వెంకన్న బాబు, బింగు విష్ణుమూర్తి, ములకలపల్లి సరోజిని ఎమ్మార్పీఎస్ విఆర్ పురం మండల అధ్యక్షులు తుంగ కుమార్, అధిక సంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## ముద్రగడ మరణం బడుగు బలహీన వర్గాలకు తీరని లోటు : వాసిరెడ్డి అర్జున్



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో రాజకీయాలలో తనదైన ముద్రవేసిన నీతి, నిజాయితీ పరుడు ముద్రగడ పద్మనాభం మృతి బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటనీ ఏడిద కాపు సంఘం నాయకుడు వాసిరెడ్డి అర్జున్ పేర్కొన్నారు. మండపేట మండలం ఏడిద గ్రామంలో మహాజననేత, ప్రజాబంధు ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్రగడ, తండ్రి, తాత ప్రత్తిపాడు నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాలకు ఎనలేని సేవందించారనీ ఆయన తన నివాళులు అర్పించారు.రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు మాట్లాడుతూ ముద్రగడ తో తనకు ఉన్న నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని వివరించారు.తాను ముద్రగడ పద్మనాభం తో కలసి అనేక ఉద్యమాలు చేసానన్నారు. ఉత్తర కంచి ఉద్యమం నుంచి తుని ఉద్యమం వరకూ చేసిన పోరాటాలు వివరించారు. రాజకీయాలలో ముద్రగడ వంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారన్నారు. నీతి, నిజాయితీలకు మరో పేరన్నారు.ఏడిద మాజీ ఉప సర్పంచ్ అనుకుల సుబ్బారావు మాట్లాడుతూ ఆయన పేరులోనే ముద్ర ఉందనీ ఆయన తెలుగు ప్రజల హృదయాలలో చెరగని ముద్రవేసారన్నారు. నిస్వార్ధ ప్రజాసేవకుడనీ ఆయన కొనియాడారు. ఏడిద గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు పర్వతిన వీర్రాజు మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం అన్నికులాలకూ సన్నిహితుడనీ, అటువంటి నేత అరుదుగా ఉంటారన్నారు.ఏడిద సొసైటీ అధ్యక్షులు గొడవర్తి సత్యనారాయణ (ఎర్రబ్బి) మాట్లాడుతూ త్యాగానికి మరో పేరు ముద్రగడ అనీ పేర్కొన్నారు. సొసైటీ మాజీ అధ్యక్షులు రామిశెట్టి శ్రీహరి మాట్లాడుతూ ముద్రగడ ఆశయాలను నెరవేర్చాలనీ కోరారు. జనసేన నాయకుడు చల్లా మణికంఠ తదితరులు ప్రసంగించారు. ఈ సంతాప సభలో రామిశెట్టి శ్రీనివాస్, చంద్ర శ్రీనివాస్,మేకా జేజి బాబు, బండారు రాంబాబు, రాగాల వెంకటరమణ ,చంద్ర సత్యనారాయణ, పువ్వల సూర్యనారాయణ, బూరుగ జానీ, గంధం పుల్లాజి, గోలుగూరు రమేష్, మెండుకుదురు సురేష్, సరికొప్పుల సాయి, పలివెల సూర్రావు, సరికొప్పుల వినయ్, చీపురు శ్రీనివాస్, రామిశెట్టి రాజా, పెద్దిరెడ్డి వినోద్, చల్లా వెంకటేష్, చవటపల్లి గణేష్, రామిశెట్టి అశోక్ తదితరులు పాల్గొన్నారు.


మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!

నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!

- బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS

WhatsApp channel

మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి

JOIN NOW

లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E

మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.



### మహిళలకు రక్షణ కల్పించడంలో

# కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం

**రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు... నేరస్తులకు భయం లేదు - ఇదే కూటమి పాలన : వైసీపీ మాజీ ఎంపీ చింతా అనురాధ**





**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలు, వేధింపులకు నిరసనగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్ఆర్సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు, మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీమతి చింతా అనురాధ మహిళలతో కలిసి అమలాపురంలోని ఈదరపల్లి వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి వినతి పత్రాన్ని సమర్పించారు ఈ సందర్భంగా చింతా అనురాధ మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు, వేధింపులు పెరిగిపోయాయని అన్నారు. అధికార కూటమి నేతలు, ప్రజాప్రతినిధులపై తీవ్ర ఆరోపణలు వచ్చినా ఏ ఒక్కరిపై కూడా కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం పోయిందని విమర్శించారు.రాష్ట్రంలో రాజ్యాంగ పాలన కాకుండా 'రెడ్ బుక్ రాజ్యాంగం' అమలవుతోందని, మహిళలకు రక్షణ కల్పించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మహిళలకు రక్షణ కల్పించలేని హోంమంత్రి వంగలపూడి అనిత వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో దిశ చట్టంతో మహిళలకు భద్రత, భరోసా కల్పించారని, నేడు మహిళలు భయం, అభద్రత మధ్య జీవించే పరిస్థితి ఏర్పడిందన్నారు. మహిళలపై నేరాలకు పాల్పడిన వారిని ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ, మహిళల హక్కులు, భద్రత కోసం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతూనే ఉంటుందని చింతా అనురాధ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడిపూడి సూర్యనారాయణ, పాముల రాజేశ్వరి, గన్నవరపు శ్రీను, జున్నూరి రామారావు, పితాని బాలకృష్ణ, చెల్లుబోయిన శ్రీను, కాశి మునికుమారి, వంగా గిరిజా, సంసాని నాని, విత్తనాల శేఖర్, కొనుకు గౌతమి, మట్టా శైలజ, గుడపాటి రమాదేవి, రెడ్డి సత్య నాగేంద్రమణి, సుంకర లక్ష్మీ, ఎస్తేరు రాణి, బొక్క వెంకటలక్ష్మీ, కుడుపూడి భాగ్యలక్ష్మీ , నితుపూడి మంగతాయారు, ఆర్. మల్లేశ్వరి , కె.టి. వర్మ , పేరి కామేశ్వరరావు, కొనుకు బాపూజీ, ఇళ్ల శేషారావు, బర్రె సీతారత్నం, రాపాక విజయలక్ష్మీ, గోగు కృష్ణవేణి, వైయస్ఆర్సీపీ నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఆరు కిలోమీటర్లు..

# అష్టకష్టాలు..



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం మండలం అనాతవరం నుంచి మాగం మీదుగా అయినవిల్లి మండలం సిరిపల్లె వరకు రహదారి అధ్వానంగా మారింది. సుమారు 6 కిలోమీటర్ల మేర వాహనచోదకులు అష్టకష్టాలు పడుతున్నారు. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో రహదారి మరింత దెబ్బతింది. గుంతలు పూడ్చి రహదారులకు మరమ్మతులు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

### ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి

# జిల్లా ఉపాధ్యక్షులుగా వినయ్ కుమార్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండలం ఉట్రుమిల్లి గ్రామం పెనుమాకల వినయ్ కుమార్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి ఉపాధ్యక్షులుగా నియమితులైనారు. దీనికి సంబంధించిన నియామక పత్రం వ్యవస్థాపకులు మరియు నేషనల్ చైర్మన్ బుల్లా రాజారావు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు మోర్త దొరబాబుకు అందజేసి యున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ పెనుమాకల వినయ్ కుమార్ గతంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకత్వంలో పనిచేశారని అదేవిధంగా డప్పు కళాకారులు చర్మకారుల పెన్షన్ రావడానికి కృషి చేశారని అంతేకాకుండా సామాజిక కార్యకర్తగా షెడ్యూల్ కులాలు షెడ్యూల్ తెగల వారికి అనేక విషయాల్లో పోరాటం చేశారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ నియామకం పట్ల వినయ్ కుమార్ మాట్లాడుతూ సంతోషం వ్యక్తం చేశారు. నాకు అప్పగించిన బాధ్యత ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి నిబంధనలకు లోబడి పని చేస్తానని తెలియజేశారు. ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించిన వ్యవస్థాపకులు మరియు నేషనల్ చైర్మన్ బుల్లా రాజారావుకి అలాగే జిల్లా అధ్యక్షులు దొరబాబుకి కృతజ్ఞతలు తెలియజేశారు.

# మహిళలు స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబన సాధించాలి

**సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభించిన మంత్రి వాసంశెట్టి సుభాష్**




**రామచంద్రపురం, విశ్వం వాయివ్ న్యూస్ :** మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని స్త్రీ శక్తి భవనంలో ఉచిత టైలరింగ్ శిక్షణా కార్యక్రమాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాంబాబు, ఎల్డిఎం కేశవ వర్మ, ఆర్ఎస్ ఈటిఐ డైరెక్టర్ రమణ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని, వారికి నైపుణ్యాభివృద్ధి ద్వారా స్థిరమైన ఆదాయ వనరులు కల్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ సహకారంతో నిర్వహించే ఈ శిక్షణలో ఆధునిక టైలరింగ్ మెళకువలు, కుట్టు యంత్రాల వినియోగం, దుస్తుల తయారీ విధానాలు, స్వయం ఉపాధి అవకాశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తారని మంత్రి వెల్లడించారు. వృత్తి నైపుణ్య శిక్షణ తీసుకున్న వారికి బ్యాంకు రుణాలు అందించి మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పనిచేస్తున్నామన్నారు. మహిళల అభివృద్ధి లేకుండా సమాజ అభివృద్ధి సాధ్యం కాదని మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం, సమాజం బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. యువతులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించి సమాజంలో తలెత్తుకొని నిలబడేలా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.రాంబాబు మాట్లాడుతూ మహిళల కోసం భవిష్యత్తులో మరిన్ని ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా సాధికారత లక్ష్యంగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ కృషి చేయడం అభినందనీయమన్నారు. 30 రోజుల శిక్షణానంతరం సర్టిఫికెట్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం మహిళలకు అవసరమైన కిట్లు మంత్రి సుభాష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎల్డిఎమ్ కేశవ వర్మ, ఆర్ఎస్ ఈటిఐ డైరెక్టర్ రమణ, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, కూటమి పార్టీ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### రామచంద్రపురం సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు

# నిత్య ఉపయోగకర కిట్ల పంపిణీ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురంలోని స్టీల్ వెల్ పేటలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్రంక్ బాక్సులు, ప్లేట్లు, గ్లాసులు, బ్లాంకెట్లు, స్వెటర్లు, టవల్స్‌తో కూడిన కిట్లను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ విద్యను మించిన ఆయుధం మరొకటి లేదని, ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'ముస్తాబు' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యా వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు అమలు చేసి, ప్రభుత్వ విద్యను మరింత నాణ్యంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రభుత్వం ఆర్థిక సంక్షోభాన్ని అధిగమిస్తూనే ఈనెల 22న 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ వసతి గృహంలో ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్‌కు చెందిన 112 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. మంత్రి విద్యార్థినులతో స్వయంగా మాట్లాడి వారి అవసరాలు, సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ప్రతి గదిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థినుల సౌకర్యార్థం సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా 112 మందికి పరుపులు, పిల్లోలు, రెండు ఇన్వర్టర్లు, కళాశాలలకు వెళ్లడానికి రెండు ఎలక్ట్రిక్ ఆటోలను సమకూర్చనున్నట్లు హామీ ఇచ్చారు. ఇదే క్రమంలో, పేదరికం కారణంగా బీఫార్మసీ చదువు కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అనకాపల్లి జిల్లా రేవు పోలవరం గ్రామానికి చెందిన మల్లే రత్నం అనే విద్యార్థినికి మంత్రి తన సొంత నిధుల నుంచి రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎస్‌డబ్ల్యూఓ పద్మశ్రీ, మున్సిపల్ కమిషనర్ ఏవీఆర్‌ఆర్ రాజు, డీఈ శ్రీకాంత్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు కె. లోవలక్ష్మి, జి. సీతాదేవి, ఎస్‌కేపీపీ ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు, జాస్తి విజయలక్ష్మి, దొమ్మలపాటి విజయలక్ష్మి, నాయకులు, అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## జీవో 396 రద్దు చేయాలని దస్తావేజు లేఖరుల డిమాండ్



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.396ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖరుల సంఘాలు చేపట్టిన "పెన్‌డౌన్" నిరసనలో భాగంగా రావులపాలెం సబ్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ వద్ద దస్తావేజు లేఖరులు మంగళవారం పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.396 అమల్లోకి వస్తే ప్రైవేటు ఏజెన్సీలో ఆగడాలు మించి మీరు పోయి అడ్డగోలు రిజిస్ట్రేషన్ కి దారి తీసి అక్రమాలు పెరిగిపోయే అవకాశం ఉందని అంతేకాకుండా దస్తావేజు లేఖరుల ఉపాధి తీవ్రంగా దెబ్బతింటుందని, వేలాది కుటుంబాలు జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని అలాగే దస్తావేజు లేఖర్ల తో పాటు మేధావులు వర్గాలతో చర్చించి పునఃసమీక్షించాలని కోరారు.రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న పెన్‌డౌన్ కారణంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దస్తావేజుల తయారీ పనులు నిలిచిపోవడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరగడం లేదు. తద్వారా కచ్చిదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది తక్షణమే ప్రభుత్వ వీటిపై తుది నిర్ణయం తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుకుంటున్నారు ఈ కార్యక్రమంలో పూలగుర్తు రామారావు పెంటపాటి రమేష్ పెంటపాటి ఈశ్వర్ కుమార్ నాగేశ్వరరావు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు బ్లీచింగ్ పిచికారీ



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వర్షాకాలం నేపథ్యంలో ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు చేపట్టారు. 3, 5 వార్డుల్లో శానిటరీ ఇన్స్పెక్టర్ రాజీవ్ ఆధ్వర్యంలో డ్రైనేజీల్లో బ్లీచింగ్ చల్లారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్ రవివర్మ మాట్లాడుతూ, దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# ఈ మలుపు.. ప్రమాదాలకు పిలుపు..



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నియోజకవర్గ ముఖ్య కేంద్రమైన ముమ్మిడివరం నుండి కాట్రేనికోన వెళ్లే ఆర్ అండ్ బీ రహదారికి అయినాపురం చర్చి వద్ద మలుపు ప్రమాదకరంగా మారింది. ఇక్కడ కాలువకు రక్షణ గోడలు లేకపోవడంతో తరచూ వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ఈ రహదారికి మరొకవైపు పంట కాలువ పొంచి ఉంది. రాత్రి వేళలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# పొడగట్లపల్లిలో ఉచిత వైద్యశిబిరం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం మండలం పొడగట్లపల్లిలోని శ్రీవిజయదుర్గ అమ్మవారి గుడి వద్ద మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రావులపాలెంలోని ప్రగతి నర్సింగ్ హోమ్, సితార ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యులు బలరామరెడ్డి, సందీప్ రెడ్డిలు పాల్గొని ఎముకలు, మెడ, నరాలు, గుండె, మధుమేహం, రక్తపోటుకు సంబంధించిన వైద్యసేవలు అందించి రక్తపరిక్షలను ' నిర్వహించారు. మందులు అవసరమైన వారికి ఉచితంగా అందించారు. సుమారు 200 మంది ప్రజలు ఈవైద్యశిబిరంలో పాల్గొని వైద్యసేవలను పొందారు.

# పంట నమోదు ఆలస్యం చేయొద్దు...

**పంటల భీమాతో రైతుకు ఆర్థిక భరోసా - మండల వ్యాప్తంగా ఇప్పటి వరకూ 3 వేల ఎకరాల్లో పంట నమోదు**
**మండల వ్యవసాయ అధికారి కె.వి.ఎన్. రమేష్ కుమార్ పిలుపు**




**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రైతులు పంట నమోదు, పంటల భీమాను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోపు పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.వి.ఎన్. రమేష్ కుమార్ సూచించారు. రాయవరం మండలంలోని సోమేశ్వరం, రాయవరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తుంది' కార్యక్రమంలో ఆయన రైతులకు పంట నమోదు, ప్రధానమంత్రి పసల్ భీమా యోజన (పిఎమ్ఎఫ్ బివై) పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి పొలానికి 20 మీటర్ల పరిధిలోకి వెళ్లి పంట నమోదు చేపట్టాల్సి ఉంటుందన్నారు. రాయవరం మండలంలో సుమారు 16 వేల ఎకరాల సాగుభూమికి పంట నమోదు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 3 వేల ఎకరాల్లో నమోదు పూర్తయిందన్నారు. పంట నమోదు, రైతు ధృవీకరణకు సెప్టెంబర్ 15, 2026 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాల ముప్పు ఉన్నందున ప్రతి రైతు పంటల భీమా చేయించుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి పసల్ భీమా యోజన కింద రైతులు స్వల్ప ప్రీమియం చెల్లిస్తే, మిగిలిన ప్రీమియాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయని వివరించారు. రాయవరం మండల రైతులు 0.2 శాతం రైతు వాటా చెల్లించాల్సి ఉంటుందని, వరి పంటకు ఎకరానికి కేవలం రూ.76 మాత్రమే ప్రీమియంగా చెల్లించాలని తెలిపారు. రైతు వాటా చెల్లించేందుకు ఆగస్టు 15 చివరి తేదీ అని పేర్కొన్నారు. పంట రుణం పొందిన రైతులు సంబంధిత బ్యాంకులు లేదా సహకార సంఘాల ద్వారా, పంట రుణం పొందని రైతులు కామన్ సర్వీస్ సెంటర్లు, రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రీమియం చెల్లించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సోమేశ్వరం గ్రామ కూటమి నాయకులు వైఆర్‌కే పరమహంస, శాకా నాగేంద్ర, నాగదేవర తాతాజీ, రాయవరం గ్రామ అభివృద్ధి చైర్మన్ ఉండవల్లి రాంబాబు, తదితర రైతులు, వ్యవసాయ సహాయక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కర్రివానిరేవులో గ్రామస్థుల ఆందోళన



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం మండలం కర్రివాని రేవు గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఆక్వా చెరువులకు జనావాసాల నుండి 11 కె.వి విద్యుత్ లైన్లు నిర్మాణం చేపట్టడంపై నిరసన వ్యక్తం చేశారు. ముమ్మిడివరం సి ఐ మోహన్ కుమార్, ఎస్సై శివకృష్ణ గ్రామస్తులతో చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. విద్యుత్ ఉన్నతాధికారులు ఈ సమస్యపై స్పందించి హై టెన్షన్ వైర్లు ఏర్పాటు నిలుపుదల చేయాలని లేని పక్షంలో కోర్టును ఆశ్రయిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు.



# సేవకు ప్రతిరూపం... ప్రాణదాతకు 82వ జయంతి శుభాకాంక్షలు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం వేళంగి గ్రామానికి చెందిన గ్రాడ్యుయేట్ యూత్ సభ్యుడు ఎర్ర విక్రమ్ ఆధ్వర్యంలో పగలు రేయి అని తేడా లేకుండా తన సొంత సుఖాలను పక్కనపెట్టి ప్రజల ప్రాణ రక్షణే పరమావధిగా శ్రమించిన మానవత్వానికి మారుపేరు సేవకు ప్రతిరూపం ప్రాణదాత మరియు వేళంగి గ్రామ మాజీ సర్పంచ్ అయిన స్వర్గీయ డాక్టర్ బి.సుబ్రహ్మణ్యం 82 వ జయంతి కార్యక్రమమును మంగళవారం ఆయన విగ్రహం వద్ద జరిపారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాస నర్సింగ్ హోమ్ మరియు బొండా ట్రస్ట్ ఆఫ్ చైర్మన్ డాక్టర్ బోండా వెంకన్న రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మెర్ల వీరయ్య చౌదరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. డాక్టర్ కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ అక్కడ ఉన్న కొంతమంది గ్రామస్తులు ఆయనకు నివాళులర్పించారు. ఆయన నిస్వార్థ సేవకు మారుపేరని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పురం సత్యప్రసాద్, కుంచె సాంబమూర్తి, హాస్పటల్ మరియు పంచాయితీ సిబ్బంది, గ్రామ యువత తదితరులు హాజరయ్యారు.

### ఎమ్మెల్యే పంతం నానాజీ చొరవతో

# వాహనదారులకు మోక్షం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** గుంతల మయంగా ఉన్న ఐటిఐ వెనుకాల రోడ్డులో వెళ్లే వాహనదారులు ఇతరులు తీవ్ర ఇబ్బందులకు గురి కావడం ప్రత్యక్షంగా చూసిన రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ చొరవ తీసుకుని ఆ రోడ్డును ఎర్ర కంకరితో నింపించి చదును చేయించారు దీనితో వాహనదారులు అమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకుని ప్రయాణించడం గమనార్హం. నానాజీ చొరవ తీసుకుని దగ్గర ఉండి రోడ్డుకి మోక్షం కల్పించడంతో ప్రతిరోజు ఈ దారిలో స్కూలుకు వెళ్లే వాళ్ళు, ఉద్యోగాలకు వెళ్లే వారు, చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా నానాజీ చేసిన ఈ మంచి పనికి నానాజీని అభినందించి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

### రాపాకలో సార్వా వరిలో సస్యరక్షణ, సాగులో

# మెళకువలపై అవగాహన సదస్సు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో ప్రస్తుత ఎల్ నీనో పరిస్థితులలో అడపాదడపా వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలకు సార్వా వరి, కూరగాయల పంటలలో చీడపీడలు ఎక్కువ అయ్యే అవకాశం ఉందని, రైతులు తగిన సస్య రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డా. చల్లా వెంకట నరసింహ రావు తెలిపారు. మంగళవారం సీతానగరం మండలంలో రాపాక గ్రామంలో స్థానిక సొసైటీ వద్ద రైతు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, వరిలో పలు చీడపీడల నివారణకు ఈ క్రింది విధంగా సూచనలు ఇచ్చారు. డా.నరసింహ రావు మాట్లాడుతూ,ఎల్ నీనో వర్షాభావ పరిస్థితి కి వరిలో ఆకునల్లి ఆశించి, ఆకులు ఎర్రబడితే, నివారణకు డైకాఫోల్ 5.0 మి. లీ. / లీటర్ నీటి కి కలిపి పిచికారీ చేయాలి.వరి పంటలో ఎండాకు తెగులు ఆశించి, ఎండాకు సోకినట్లయితే, పాత నీటిని తీసి, ఆరగట్టి, తిరిగి నీరు పెట్టాలి. నత్రజని ఎరువుల వాడకం తాత్కాలికశీగా ఆపివేయాలి.మ్యూరేట్ ఆఫ్ పోటాష్ ఎకరాకు 20 కిలోలు వేయాలి. తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే, ప్లాంటోమైసిన్ 1.0 గ్రా. ం కాపర్ హైడ్రాక్సయిడ్ 2.0 గ్రా / లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.గడ్డి దుబ్బు తెగులు లేదా కాండం కుళ్ళు తెగులు కనిపిస్తే, నివారణకు టెబ్యూకోనజోల్ 2.0 మి. లీ./ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.ఎలుకల నివారణకు, పంట పరిసరాల పరిశుభ్రత ముఖ్యం. గట్లను చెక్కుకొని, పొలం లో అక్కడక్కడ ఎలుక బుట్టలు అమర్చుకొంటే, వలస పోయే ఎలుకలు అందులో పడి చనిపోతాయి. ఎలుక బొరియల్లో పొగబారించాలి. బ్రోమాడియోలోన్ 2% ఎర మందును, (96 పాళ్ళు నూకలు, 2 పాళ్ళు నూనె, 2 పాళ్ళు బ్రోమాడియోలోన్ మందు మిశ్రమం) 10 గ్రాముల పొట్లాలుగా కట్టి, ఎలుక బొరియల వద్ద అమర్చాలి. రైతులు అందరూ సామూహికంగా చేపట్టాలి.వరి పంట లో మొవ్వు పురుగు నివారణకు, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రా లేదా క్లోరంట్రనిలిప్రోల్ 0.3 గ్రా లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి. లీ. లీటర్ నీటి కి కలిపి పిచికారీ చేయాలి. ఏ డి ఏ జయరామ లక్ష్మి వరిలో నీరు, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు విపులంగా వివరించారు.రైతు శిక్షణ కార్యక్రమం లో ముఖ్య అతిథి జిల్లా వ్యవసాయ అధికారి ఇంచార్జీ సూర్య రమేష్ మాట్లాడుతూ, ఎల్ నీనో నేపథ్యంలో వ్యవసాయ శాఖ చేపడుతున్న పంటల వికేంద్రీకరణ, యాప్ ద్వారా ఎరువుల కొనుగోలు గురించి రైతులకు వివరించారు. శాస్త్రవేత్తలతో పాటు జిల్లా వ్యవసాయ అధికారి ఇంచార్జ్ కే సూర్య రమేష్ డిఆర్ సిఏ డిఏ ఎస్. జయ రామలక్ష్మి, ఏఓఏ గౌరీదేవి ఏఈ ఓ.గురుప్రియ విఏఏ ప్రవీణ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

### కాకినాడ రూరల్ ఎమ్మెల్యే 'పంతం' చొరవతో

# డ్రైనేజీ పనులు ప్రారంభం





**కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం నడకుదురు గ్రామం సిద్ధార్థ నగర్ లో సుమారు 20 లక్షల రూపాయలతో డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యాయి అంబేద్కర్ విగ్రహం నుండి ఆంజనేయస్వామి గుడి వరకు అదే విధంగా స్థానిక ఎస్సీ పేటలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక శాసనసభ్యులు పంతం నానాజీ దృష్టికి కరప మండల జనసేన పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మెండు గోవింద్ సమస్యను చెప్పిన వెంటనే డ్రైనేజీ నిర్మాణానికి హామీ ఇచ్చి నేడు పనులు ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు

### అనుమతులు లేకుండా రఘుదేవపురం

# ఇసుక ర్యాంపు నుండి ట్రాక్టర్లు ద్వారా ఇసుక తరలింపు

## స్పందించని రెవెన్యూ, మైనింగ్ అధికారులు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండల పరిధిలోని రఘుదేవపురం ఇసుక ర్యాంపు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా కొందరు అక్రమార్కులు ఇసుకను తరలించి అధిక రేట్లకు విక్రయిస్తూ తమ జేబులు నింపుకుంటున్నారని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ఇదంతా తెలిసినా రెవిన్యూ మరియు మైనింగ్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై మండల ప్రజల నుండి పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మే నెల 31వ తారీకు నుండి జిల్లా అధికారులు నదీ గర్భం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా నదీ గర్భం నుండి ఇసుకను తరలించరాదని ఆదేశాలు జారీ చేసినప్పటికీ అధికారుల ఆదేశాలను తుంగలో తొక్కి మరీ ఇక్కడ ట్రాక్టర్ల యజమానులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. నేటి ప్రభుత్వం ప్రజలకు ఉచిత ఇసుక విధానాన్ని అందించాలనే నేపథ్యంలో మండల వ్యాప్తంగా ఇసుక స్టాకులకు అనుమతులు ఇచ్చింది. ఇసుక స్టాక్ పాయింట్లు నుండి ఇసుక దళారులు అందరూ సిండికేట్ అయి ప్రభుత్వం నిర్ణయించిన రేటు కన్నా ఎక్కువ రేటుకు విక్రయాలు జరపాలనే ఉద్దేశంతో స్టాక్ పాయింట్ల నుండి ఇసుకను ప్రజలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారనే ఆరోపణలు మండల ప్రజల నుండి వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా అధికారులు పనిచేయా ల్సిఉంది. రఘుదేవపురం ఇసుక ర్యాంపు నుండి అలాగే సీతానగరం కైలాస భూమి ఇసుక ర్యాంపు నుండి ఇసుక అక్రమంగా తరలి పోకుండా తగిన కట్టుదిట్టమైన చర్యలు మైనింగ్ మరియు రెవిన్యూ అధికారులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### అంబటి రాంబాబుకి

# కౌంటర్ ఇచ్చిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం సం జీవయ్య నగర్ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆవ రణంలో ఎంఎస్పి గోకవరం మండల అధ్యక్షులు గరబారపు శ్రీనివాస్ మాదిగ మండల అధ్యక్షులు చాపల సూరిబాబు మాదిగ ఆధ్వర్యంలో వైసిపి మాజీ మంత్రి అంబటి రాంబాబు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ వైసిపి మాజీ మంత్రి అంబటి రాంబాబు తక్షణం క్షమాపణ చెప్పాలి మాదిగలపై ఇటువంటి చౌకుబారు రాజకీయాలు మానుకోవాలని లేని పక్షంలో అంబటి రాంబాబుకి తగిన గుణపాఠం చెప్పి తీరుతామని మాదిగలపై నోటికి వచ్చినట్లు మాట్లాడితే చూసి ఊరుకోమని క్షమాపణ చెప్పకుంటే పోరాటానికి సిద్ధమని శ్రీనివాస్ మాదిగ హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి గోకవరం మండలం ఉపాధ్యక్షులు రామవరపు రాజేష్, ప్రధాన కార్యదర్శి పులుగుర్తి రాములు, చింతాటి వెంకన్న, గున్నూరి లాజరు, అరసాల మోహన్, మోర్త సోమరాజు, అరసాల శ్రీను, బొడ్డపాటి చిన్ని, బొద్దాని బాపిరాజు, చింతాటి చిటియ్య, అరసాల వెంకన్న, గొర్త ప్రభుదాసు, కందుకూరి నాగరాజు, చింతాటి ఏసు, దొండపాటి చినబాబు, వంగలపూడి శ్రీను, తోలేటి దావీదు, దొండపాటి వెంకన్న, మోర్త యేసు, వేమగిరి అరవాలి, ఉండ్రాసి చిన్ని, బొద్దాని అప్పారావు, వేమగిరి ఏసు, కందుకూరి సోమరాజు, చింతాటి రాజు, చింతాటి చైతన్య, రాంబాబు పాల్గొని నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు.

# భోగాపురం ఎయిర్ పోర్టు ఓపెనింగ్..

## ప్రధాని మోదీ, రైతుల కోసం ప్రభుత్వం స్పెషల్ ఎఫెక్ట్స్!

వచ్చేనెల 1న భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ప్రధాని మోదీ చేతుల మీదుగా జరగున్న ఈ కార్యక్రమంపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయించింది. ముఖ్యంగా ఉత్తరాంధ్రలో ప్రతి గడప ఈ వేడుకను ఘనంగా జరుపుకునేలా ప్రణాళికలు రచిస్తోంది. భూములు ఇచ్చిన రైతులకు ఉచిత విమాన ప్రయాణం కల్పించడంతోపాటు ఎయిర్ పోర్టుకు అనుబంధంగా ఏవియేషన్ వర్సిటీ, జీఎంఆర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, జీఎంఆర్-మాన్సాస్ ఎడ్యుసిటీ ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉత్తరాంధ్రను గ్లోబల్ కనెక్టివిటీకి కేంద్రంగా మార్చేందుకు భోగాపురం విమానాశ్రయాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ముందుగా విమానాశ్రయం కోసం భూములు కోల్పోయిన రైతుల ఆశీస్సులు దక్కించుకునేలా కీలక నిర్ణయం తీసుకుందని చెబుతున్నారు. భూములిచ్చిన రైతులు, యజమానులందరికీ ఒకమారు ఉచిత విమాన ప్రయాణ అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారికంగా ప్రకటించారు. దీంతో ప్రభుత్వ ఆలోచనపై విస్తృత చర్చ జరుగుతోంది. 2014-19 మధ్య విమానాశ్రయం నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని ప్రభుత్వం భారీగా భూ సేకరణ చేసింది. అయితే ఈ విషయమై అప్పట్లో తీవ్ర పోరాటం జరిగింది. ఫలితంగా ప్రభుత్వంపై రైతుల్లో అసంతృప్తి నెలకొందనే ఆలోచనతో ప్రభుత్వం వ్యూహాత్మక నిర్ణయం తీసుకుందని చెబుతున్నారు. భూములు ఇచ్చిన రైతుల త్యాగం వృథాగా పోలేదని చాటిచెప్పడమే కాకుండా, భవిష్యత్తులో ఈ ప్రాంతం అభివృద్ధికి రైతులు దోహదపడ్డారనే విషయాన్ని తెలియజేయడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెబుతున్నారు. ఈ విధంగా రైతుల్లో అసంతృప్తిని తొలగించడమే కాకుండా వారి త్యాగాలకు విలువ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోందని అంటున్నారు. ఇదే సమయంలో భోగాపురం విమానాశ్రయాన్ని



కేవలం రాకపోకల కేంద్రంగానే కాకుండా, ఉత్తరాంధ్రను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడానికి ఒక వేదికగా మలిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించేందుకు రైతులను ముందుకు తీసుకువస్తోందని భావిస్తున్నారు.

**రెండు జిల్లాల కలెక్టర్లకు బాధ్యతలు**

కాగా, విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యతలను ప్రభుత్వం విజయనగరం, శ్రీకాకుళం కలెక్టర్లకు అప్పగించింది. అంతేకాకుండా ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నాయకులు అందరూ ప్రధాని సభను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ కార్యక్రమంపై పది రోజుల పాటు విస్తృత ప్రచారం చేయడంతోపాటు ఆగస్టు 1న ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం సూచించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యేక పార్కింగ్ స్లాట్లతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నారు. సభకు వచ్చే వారి కోసం అల్పాహారం, భోజనం, తాగునీటి సదుపాయాలు కల్పించేలా కలెక్టర్లు, ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### ఘనంగా యునైటెడ్ పాస్టర్స్ ఫౌండేషన్

# సీతానగరం మండల సహవాస కూడిక



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం సింగవరం గ్రామం లోని ఏసుక్రీస్తు రారాజు మందిరంలో యునైటెడ్ పాస్టర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు రెవరెండ్ వి రాజు జోషియా ఆధ్వర్యంలో మండల స్థాయి దైవ సేవకుల సహవాస కూడిక ఆత్మీయ వాతావరణంలో ఘనంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా రెవ. కె. నారాయణరావు దేవుని వాక్యాన్ని బోధించి, దైవ సేవలో ఐక్యత, ప్రేమ, పర స్పర సహకారం మరియు సంఘాల అభివృద్ధి గురించి సందేశమిచ్చారు.అధ్య క్షులు రెవ. రాజు జోషియా మాట్లా డుతూ, సీతానగరం మండ లంలోని దైవ సేవకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఆత్మీయ సహవాసాన్ని బలో పేతం చేయడం యునైటెడ్ పాస్టర్స్ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ ఫెలోషిప్ ద్వారా ప్రతి నెల సహవాస సమావేశాలు, నాయకత్వ శిక్షణ, సువార్త కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు మరి యు సంఘాల అభివృద్ధికి దోహ దపడే అనేక కార్య క్రమాలు నిర్వహిం చను న్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో ఫెలోషిప్ గౌరవ అధ్యక్షులు రెవ. ఎం. పద్మారావు,రెవ. ఏసుదాస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వ హిం చి, దైవ సేవకుల ఐక్యత, సంఘాల ఆత్మీయ అభి వృద్ధి మరియు దేవుని రా జ్యవిస్తరణ కొరకు ప్రార్థిం చారు.అనంతరం దైవ సేవ కులు పరస్పర సహవాసం లో పాల్గొని,రాబోయే నెల ల్లో నిర్వహించనున్న కార్యక్రమాలపై చర్చించి, ఫెలోషిప్‌ను మరింత బలో పేతం చేయాలని నిర్ణయిం చారు.యునైటెడ్ పాస్టర్స్ ఫౌండేషన్ సీతానగరం మండల కార్య వర్గం అధ్య క్షులు రెవ. రాజు జోషియా కార్యదర్శి రెవ. కె.నారాయణరావు, ఉపాధ్యక్షులు బ్రదర్ పి.రత్నరాజు, సంయుక్త కార్యదర్శి పాస్టర్ జి.రాజేష్, కోశాధికారి రెవ. జాన్ మోజెస్,కార్యవర్గ సభ్యులు పాస్టర్ పి.ఇందిరా ప్రియ దర్శిని,పాస్టర్ ఎస్.ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గానికి ఆమడ దూరంలో గోదావరి పొంగిపొర్లుతున్న వాటిని ఒడిసిపట్టి ప్రజల దాహార్తి తీర్చలేని ప్రజా ప్రతినిధులు ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు తప్ప సమస్యకు చిత్తశుద్ధితో పరిష్కార మార్గాన్ని చూపలేకపోతున్నారని నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వాలైన, నేటి ప్రభుత్వమైనా పార్టీ ప్రయోజనాలు, భవిష్యత్తు పరిణామాలు దృష్టిలో పెట్టుకొని ఆయా గ్రామాలకు నిధులు వెచ్చిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ప్రధానంగా పట్టిపీడిస్తున్న సమస్య డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీరు, సాగునీరు, పారిశుధ్య నిర్వహణ, స్మశాన వాటికల వసతులు, విద్యుత్తు వంటి సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రజలు దశాబ్దాలు తరబడి ప్రజా ప్రతినిధులకు,అధికారులకు ఫిర్యాదులు ఇస్తూనే ఉన్నామని, వాటిని నామమాత్రంగా పరిష్కరించి చేతులు దులుపుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ఉన్న డ్రైనేజీ వ్యవస్థనే సక్రమంగా నిర్వహించకపోవడం, సిసి రోడ్లు వేస్తున్న,కొత్త డ్రైనేజీలు నిర్మించకపోవడం, సత్యసాయి త్రాగునీటి పథకాన్ని నిర్లక్ష్యం చేయడం, స్మశాన వాటికలకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, గ్రామాల్లో ప్రతి ఇంటి నుండి సక్రమంగా చెత్త సేకరించకపోవడం వంటి సమస్యలతో అనునిత్యం ప్రజలు సతమత మవుతున్నారు. మరోవైపు కోతులు, కుక్కలు, పందుల సమస్యలతో మహిళలు ప్రతిరోజు ఎదుర్కొంటున్న సమస్యలు వర్ణాతీతం. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రాధాన్యత క్రమంలో చిత్తశుద్ధితో ఈ సమస్యలను పరిష్కరించాలని పలు గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

**ప్రజల జీవితాలు మారాలంటే... మాటలు కాదు, చేతలు కావాలి!**

# చిన్న నాటి నుండి నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకోవాలి

### నారాయణ విద్యాసంస్థల్లో ఇన్వెస్టిచర్ సర్మని



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్యాపురంలోని నారాయణ విద్యా సంస్థల్లో ఇన్వెస్టిచర్ సెర్మని కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిధిగా బి.జె.పి. వర్కింగ్ కమిటీ సభ్యులు నర్సిపల్లి హరిక హాజరయ్యారు.ఆమె సమక్షంలో విద్యార్థుల ఆనందసందోత్సవాల మధ్య విద్యార్థులచే ఎన్నిక కాబడిన విద్యార్థులకు జిఎం. విజయ భాస్కర్ రెడ్డి చేతుల మీదుగా పాఠశాల నాయకులుగా ప్రమాణ స్వీకారం కన్నుల పండుగగా, ఘనంగా జరిగింది. ఏజిఎం. షేక్ ఆలీషా, ప్రిన్సిపాల్ శైలజ ప్రోత్సాహంతో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగమైన ఈ ప్రోగ్రాంలో విద్యార్థులకు చిన్ననాటి నుండి నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకోవాలని సూచించారు.దూరదృష్టి, నిజాయితీ, ఆత్మ విశ్వాసం, సమర్థమైన సంభాషణ, నిర్ణయ సామర్థ్యం వంటి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని విద్యార్థులకు తెలిపారు.

మహిళపై దాడిని ఖండిస్తూ

# వైఎస్సార్‌సీపీ మహిళల నిరసన ర్యాలీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో మహిళను వివస్త్రను చేసి వేధించిన ఘటనను ఖండిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీలో మాజీ హోంమంత్రి తానేటి వనిత, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మితో కలిసి మాజీ ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్, మాజీ రుడా చైర్‌పర్సన్, రాష్ట్ర పార్లమెంట్ కార్యదర్శి, ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిళారెడ్డి పాల్గొన్నారు. నిరసన ర్యాలీలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నాయకులు ఆరోపించారు. మహిళలకు రక్షణ కల్పించడంలో పాలకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు మార్త లక్ష్మి, పోలు విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్ చోడిశెట్టి సత్యవేణి, మాజీ చైర్‌పర్సన్ సంకిశ భవాని, ఆచంట అనసూయ, సత్య, కృష్ణవేణి, సరిత, దేవి, సూర్యకుమారి తదితర మహిళా నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, డివిజన్ స్థాయి మహిళా నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై నిరసనలో పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మహిళల భద్రతపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

# సురక్షితమైన మంచినీటి సరఫరా కోసం 19 పరీక్షలు

### సురక్షితమైన తాగునీటి సరఫరాపై పూర్తి అప్రమత్తత - అమృత్-2.0తో శాశ్వత పరిష్కారానికి చర్యలు
### ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - హెడ్ వాటర్ వర్క్స్ పరిశీలన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగర ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడంలో ఎలాంటి రాజీ ఉండదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మహారాష్ట్ర నుంచి గోదావరిలోకి ఎర్రనీరు చేరుతున్న నేపథ్యంలో హెడ్ వాటర్ వర్క్సను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి నాణ్యతపై అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం నీటికి 19 రకాల నాణ్యత పరీక్షలు నిర్వహిస్తూ సురక్షితమైన మంచినీటి సరఫరా కొనసాగిస్తున్నామని, అలాగే అమృత్--2.0 పథకం ద్వారా నగరానికి శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వెల్లడించారు. మహారాష్ట్ర ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదికి వరద ప్రవాహం ప్రారంభమై, నది నీటి రంగు ఎర్రగా మారిన నేపథ్యంలో నగర ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వరదల సమయంలో గోదావరి నీటి రంగు మారడం సహజ ప్రక్రియేనని, అయితే ప్రజలకు సరఫరా చేసే తాగునీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. హెడ్ వాటర్ వర్క్సలో ప్రతిరోజూ నీటి నాణ్యతపై 19 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భౌతిక పరీక్షలతో పాటు రసాయన పరీక్షలు కూడా నిర్వహిస్తూ నీరు పూర్తిగా సురక్షితంగా ఉందని నిర్ధారించిన తర్వాతే ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా ప్రతి నెలా నమూనాలను విశాఖపట్నంలోని రీజినల్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీకి పంపి పరీక్షలు చేయిస్తున్నామని, ప్రతి మూడు నెలలకు ఒకసారి చెన్నైలోని మెటెక్స్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్కు పంపించి 52 రకాల అధునాతన పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ బహుళస్థాయి పరీక్షల ద్వారా నగర ప్రజలకు ఎల్లప్పుడూ నాణ్యమైన, సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత రెండేళ్లలో నగరంలోని పాత డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్లలో ఉన్న లీకేజీలను తాత్కాలికంగా మూసివేయడం కాకుండా, శాశ్వత పరిష్కారంగా అనేక ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్లు వేశామని చెప్పారు. బ్రిటిష్ కాలం నాటి పాత పైప్‌లైన్లను దశలవారీగా మార్చడంతో నీటి కలుషితానికి అవకాశం గణనీయంగా తగ్గిందన్నారు. గతంలో ప్రతి నెల వందల సంఖ్యలో లీకేజీలపై ఫిర్యాదులు వచ్చేవని, ప్రస్తుతం అవి భారీగా తగ్గడం ఈ చర్యలకు నిదర్శనమని పేర్కొన్నారు. అమృత్-2.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం, ఎంపీ పురందేశ్వరి సహకారంతో నగర తాగునీటి వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. కొత్తగా 20 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి వనరుల అభివృద్ధి, అదనపు ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్లు (ఈఎస్‌ఆర్‌లు), కొత్త పైప్‌లైన్ల నిర్మాణం, పంపింగ్ వ్యవస్థల ఆధునీకరణ వంటి పనులు ఒకేసారి మూడు బృందాల ద్వారా వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ పనులు పూర్తయితే క్వారీ ప్రాంతంతో పాటు నగరంలోని అనేక ప్రాంతాలకు శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. హెడ్ వాటర్ వర్క్సలో పీరియాడిక్ నిర్వహణ కోసం సుమారు రూ.3.30 కోట్లతో ఆధునీకరణ పనులు చేపడుతున్నామని, వర్షాకాలంలో విద్యుత్ అంతరాయం ఏర్పడినా నీటి శుద్ధి, సరఫరా ఆగకుండా ఉండేందుకు దవళేశ్వరం, కోట్లింగాల తదితర ప్రాంతాల్లో జనరేటర్లను కూడా ఏర్పాటు చేశామని వెల్లడించారు. వర్షాకాలంలో ఎక్కడైనా తాగునీటి పైప్‌లైన్లలో లీకేజీలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రజాప్రతినిధులు లేదా అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ నాణ్యమైన, సురక్షితమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ఫిర్యాదుపై తక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, అధికారులు ఆయన వెంట ఉన్నారు.

మధురపూడిలో "పొలం పిలుస్తుంది"లో

# ఆరుతడి పంటలపై అవగాహన


### బీమాను సద్వినియోగం చేసుకోండి : జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఎల్నీనో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవడంలేదని దాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు వరికి బదు లుగా అంతర్ పంటలపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని మధురపూడి గ్రామంలో నిర్వ హించిన "పొలం పిలుస్తుంది" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించి, ప్రధానమంత్రి ఫసల్ యోజన బీమా సకాలంలో చెల్లించి, పంటలు నష్టపోతే బీమా ద్వారా నష్టపరిహారం పొందాలన్నారు. వరి పంటకి ఒక ఎకరానికి 570 రూపాయలు, మినుము పంటకి 300 రూపాయలు పంటల బీమా సకాలంలో చెల్లించాలన్నారు. వాతావరణ పరిస్థితుల రీత్యా పంటలకు నష్టం ఏర్పడితే, ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం కింద వరి ఒక ఎకరానికి 33వేల నుండి 37వేల వరకు భీమ వర్తిస్తుందన్నారు. అనంతరం కోరుకొండ వ్యవసాయసహాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వల్ల ఈ ఏడాది పంటనష్టం జరిగే అవకాశం ఉందని, అందువల్ల రైతులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ప్రధాన మంత్రి ఫసల భీమ యోజనను సద్వినియోగం చేసుకోవాల న్నారు.వరి పంటకు ఆగష్టు 15 వరకు, మినుము పంటకు జూలై ఆఖరు వరకు సమయం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారిణి రామ తులసి, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ వేదిక మార్పు

### పార్టీలు, కుల లకు అతీతంగా ప్రజలు హాజరు కావాలి : ఎమ్మెల్సీ తోట పిలుపు




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** కాపు ఉద్యమ జన నేత ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ మండపేట లో ఈ నెల 23 గురువారం నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో సభ నిర్వహణ వేదిక మారినట్లు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. తొలుత సూర్య కన్వర్షన్ హాల్ లో నిర్వహించాలని నిర్ణయించారు. కాగా ఇపుడు ఈ వేదిక ను మార్పు చేసి ఏడిద రోడ్ లోని విజయ కన్వర్షన్ హాల్ లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మీడియా కు తెలిపారు. ఈ మార్పు అన్ని రాజకీయ పార్టీలలో ఉన్న కాపు సోదరులు, ఇతర వర్గాలకు చెందిన ముద్రగడ అభిమానులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 గురువారం మధ్యాంన రెండు గంటలకు ఈ సభ ఏడిద రోడ్ లో ఉన్న విజయ కన్వర్షన్ హాల్ లో నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్టీలు, కులాలు కు అతీతంగా ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు. ముద్రగడ పద్మనాభం తన వ్యక్తి గత జీవితాన్ని కోల్పోయి కాపు జాతి కోసం పాటు పడ్డారని కొనియాడారు.ఆయనకు జాతి నివాళులు అర్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



సినీ వాయిస్ CINE VOICE

# దుల్కర్ 'ఐయామ్ గేమ్' ఫస్ట్ బెట్‌కి డేట్ ఫిక్స్!




మలయాళ యంగ్ టాలెంటెడ్ హీరో దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో దర్శకుడు మిస్కిన్ తెరకెక్కిస్తున్న అవైటెడ్ థ్రిల్లర్ చిత్రాల్లో గ్యాంబ్లింగ్ నేపథ్యంలో వస్తున్న చిత్రం 'ఐయామ్ గేమ్' కూడా ఒకటి. డీసెంట్ బజ్ ఉన్న ఈ సినిమాని మేకర్స్ ఇంట్రెస్టింగ్ కంటెంట్ తో ప్రెజెంట్ చేస్తూ వస్తున్నారు. ఇలా మేకర్స్ సినిమా తాలూకా ఫస్ట్ గ్లింప్స్ పై ఇంట్రెస్టింగ్ అప్డేట్ అందించారు. దుల్కర్ ఫస్ట్ బెత అంటూ ఈ జూలై 28 డేట్ ని లాక్ చేశారు. దుల్కర్ పై పార్టీ మోడ్ లో డిజైన్ చేసిన ఈ పోస్టర్ ఫ్యాన్స్ కి మంచి కిక్ ఇస్తుంది. ఇక ఈ రానున్న గ్లింప్స్ లేదా టీజర్ తో సినిమాపై కొంచెం క్లారిటీ ఆడియెన్స్ కి రావచ్చు. ఇక ఈ చిత్రంలో దుల్కర్ సరసన కయాదు లోహర్, సంయుక్త ఫీమేల్ లీడ్ లో నటిస్తుండగా కాతిర్, శాండీ మాస్టర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అలాగే జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాని దుల్కర్ నిర్మాణం వహించాడు. పాన్ ఇండియా లెవెల్లో ఈ చిత్రం ఈ ఆగస్ట్ 20న గ్రాండ్ గా విడుదల కాబోతుంది.

## నన్ను టార్చర్ చేశారు.. మానసికంగా కుంగిపోయాను..

# వంద కోట్లు ఇచ్చినా మళ్లీ ఆ పని చేయను..



సోషల్ మీడియాలో సెలబ్రెటీల వ్యక్తిగత భద్రత గురించి చెప్పక్కర్లేదు. ప్రస్తుతం ఏఐ టెక్నాలజీ ప్రపంచంలో సినీతారల పర్సనల్ విషయాలు ఇప్పుడు నెట్టింట తెగ వైరలవుతున్నాయి. ఇప్పటికే పలువురు తారలు డీప్ ఫేక్ బారిన పడిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ హీరోయిన్ సైతం సోషల్ మీడియా కారణంగా ఎంతో బాధపడ్డానని తెలిపారు. హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. తెలుగు, తమిళం ఇండస్ట్రీలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. ముఖ్యంగా విష్ణు విశాల్ సరసన ఆమె నటించిన మట్టి కుస్తీ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఈ మూవీతో ఆమె ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. దీంతో తెలుగు, తమిళం, మలయాళం భాషలలో వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. గ్లామర్ షోకు దూరంగా ఉంటూ కంటెంట్ ప్రాధాన్యత ఉన్న చిత్రాలను ఎంచుకుంటూ విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. కుస్తీ 2ః చిత్రంలో కూడా నటించింది. ఈ చిత్రానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ నేపథ్యంలోనే ఈ సినిమా కార్యక్రమంలో మాట్లాడిన ఐశ్వర్య లక్ష్మి, తనకు వంద కోట్ల రూపాయలు ఇచ్చినా ఒక్క పని కూడా చేయనని అన్నారు. ఇదిలా ఉంటే.. ఇటీవల ఆమె మట్టి కుస్తీ 2 సినిమాతో మరో హిట్టు అందుకుంది. ఈ చిత్రానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ నేపథ్యంలోనే ఈ సినిమా కార్యక్రమంలో మాట్లాడిన ఐశ్వర్య లక్ష్మి, తనకు వంద కోట్ల రూపాయలు ఇచ్చినా ఒక్క పని కూడా చేయనని అన్నారు. ఐశ్వర్య లక్ష్మి గతంలో ఇన్‌స్టాగ్రామ్‌తో సహా సోషల్ మీడియాలో చురుకుగా ఉండేవారు. కానీ ఒక సమయంలో, తాను సోషల్ మీడియాకు గుడ్ బై చెబుతున్నట్లు ఆమె ప్రకటించారు. ఇప్పుడు అందుకు గల కారణం గురించి మాట్లాడిన ఐశ్వర్య లక్ష్మి, తనకు వంద కోట్ల రూపాయలు ఇచ్చినా సోషల్ మీడియాకు తిరిగి రానని చెప్పారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఐశ్వర్య లక్ష్మి మాట్లాడుతూ, "సోషల్ మీడియాను వదిలేయడం నాకు చాలా మనశ్శాంతిని ఇచ్చింది. నేను ఇంతకుముందు సోషల్ మీడియాలో చురుకుగా ఉన్నప్పుడు, కొంతమంది నా ఫోటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరమైన, నీచమైన వ్యాఖ్యలు పోస్ట్ చేశారు, దానివల్ల నేను చాలా మానసిక వేదనకు గురయ్యాను" అని అన్నారు. "ఆ సమయంలో ప్రపంచమంతా నాకు వ్యతిరేకంగా ఉందని, అందరూ నన్ను ద్వేషిస్తున్నారని నాకు అనిపించింది. అందుకే ఎవరైనా నాకు వంద కోట్ల రూపాయలు ఇచ్చినా నేను సోషల్ మీడియా వైపు చూడను. ఆన్‌లైన్‌లో పోస్ట్ చేయడం, కామెంట్ చేయడం కంటే ప్రజలను వ్యక్తిగతంగా కలవడానికే నేను ఇష్టపడతాను," అని అన్నారు. ప్రస్తుతం ఐశ్వర్య లక్ష్మీ చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి.

# నట సింహం నందమూరి బాలకృష్ణకు గాయాలు..

## యాక్షన్ సీన్స్ చేస్తుండగా..



నటసింహం, సినీ హీరో నందమూరి బాలకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఆయన్ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఎన్‌బికె 111 సినిమాలో భాగంగా కాకినాడ పోర్టులో యాక్షన్ సీక్వెన్స్ చేస్తుండగా.. బాలకృష్ణ కాలికి గాయం అయింది.. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది.. ఆసుపత్రికి తరలించారు. మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో మంచు మనోజ్, బాలకృష్ణపై యాక్షన్ సీక్వెన్స్ చేస్తున్నారు.. ఈ క్రమంలోనే.. ఆయన మోకాలికి గాయమైంది. బాలకృష్ణకు గాయమైందన్న వార్తలతో అభిమానులు ఆందోళనకు గురయ్యారు. అయితే.. ఎలాంటి ఆందోళన అక్కర్లేదని.. బాలయ్య బాగానే ఉన్నారని పేర్కొంటున్నారు. బాలయ్యకు పరీక్షల అనంతరం కొన్ని రోజుల విశ్రాంతి అవసరం అని వైద్యులు సూచించినట్లు సమాచారం..

### సంక్రాంతికి ముందే సినిమా..

మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ హీరోగా 'ఎన్‌బికె 111' భారీ యాక్షన్ సినిమా షూటింగ్ చకచకా జరుగుతోంది. ముంబై మాఫియా బ్యాక్ డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు పేర్కొంటున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాను క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24, 2026 న విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.. బాలయ్య, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో గతంలో 'వీరసింహారెడ్డి' లాంటి బ్లాక్ బస్టర్ హిట్ వచ్చింది. కావున సంక్రాంతికి ముందే రిలీజ్ అయ్యే.. ఈ కొత్త సినిమాపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో మంచుమనోజ్ కీలక పాత్రలో నటిస్తుండగా.. బాలకృష్ణ సరసన కాజల్ నటిస్తోంది..

క్రీడా వాయిస్ – మీ క్రీడా వార్తల స్వరము

# అప్పుడు రోహిత్ శర్మ మాటలను నమ్మలేదు : శాంసన్



భారత్ 2026 టీ20 ప్రపంచ కప్ సాధించడంలో సంజు శాంసన్ ప్రధాన పాత్ర పోషించాడు. వెస్టిండీస్‌తో జరిగిన కీలకమైన సూపర్ 8 మ్యాచ్‌లో.. తర్వాత ఇంగ్లాండ్‌తో సెమీ ఫైనల్, న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు. టోర్నమెంట్ ఆరంభంలో తుది జట్టులో చోటు దక్కకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యానని, అప్పుడు రోహిత్ శర్మ తనకు ధైర్యం చెప్పి భరోసా కల్పించాడని సంజు పేర్కొన్నాడు. అయితే, మొదట్లో రోహిత్ మాటలను తాను నమ్మలేదని, అందుకు ఇప్పుడు క్షమాపణలు చెబుతున్నానని ఓ ఇంటర్వ్యూలో శాంసన్ అన్నాడు. "నిజం చెప్పాలంటే ఆ సమయంలో రోహిత్ భాయ్ చెప్పిన మాటలను నేను నమ్మ లేదు. అందుకు ఇప్పుడు సారీ చెబుతున్నా. ఆయన తన అనుభవంతో మనస్ఫూర్తిగా మాట్లాడి నాలో ధైర్యం నింపే ప్రయత్నం చేశాడు. కానీ, ఆ సమయంలో నేను తీవ్ర నిరాశలో కూరుకుపోయి ఉన్నాను. ఆ తర్వాత రోహిత్ చెప్పిన మాటలను గుర్తు చేసుకుని.. నా ఆలోచన విధానాన్ని మార్చుకున్నాను. తర్వాత అంతా సజావుగా సాగిపోయింది" అని శాంసన్ పేర్కొన్నాడు. 2026 టీ20 ప్రపంచ కప్‌నకు ముందు న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో శాంసన్ విఫలమయ్యాడు. ఒక్క మ్యాచ్‌లోనూ 30కిపైగా స్కోరు చేయలేదు. అప్పుడు చాలా నిరుత్సాహానికి గురయ్యానని, నాలుగైదు రోజులు చాలా కష్టంగా గడిచాయని శాంసన్ పేర్కొన్నాడు. ఆ క్లిష్ట పరిస్థితి తనను మానసికంగా మరింత బలంగా మార్చిందన్నాడు.

# కేఎల్ రాహుల్‌ను ఆరో స్థానంలో పంపుతారా..?

## మండిపడ్డ క్రిస్ శ్రీకాంత్



లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో కేఎల్ రాహుల్‌ను ఆరో స్థానంలో పంపడాన్ని మాజీ చీఫ్ సెలక్టర్ క్రిస్ శ్రీకాంత్ తప్పుబట్టారు. అనుభవజ్ఞుడైన రాహుల్‌ని ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ తర్వాత పంపుతారా?అని ప్రశ్నించారు. తరచూ ప్రయోగాలు చేస్తూ బ్యాటింగ్ ఆర్డర్‌ను దెబ్బతీశారంటూ టీమ్ఇండియా మేనేజ్‌మెంట్‌పై ఫైర్ అయ్యారు. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ల్లోనూ సంజు శాంసన్, వైభవ్ సూర్యవంశీ ఓపెనింగ్ జోడీని పదేపదే మార్చారని, ఇలా చేయడం వల్ల జట్టులో స్థిరత్వం లోపిస్తుందని అభిప్రాయపడ్డారు. "అంత భారీ లక్ష్యాన్ని ఛేదించేటప్పుడు ఎవరైనా కేఎల్ రాహుల్‌ను ఆరో స్థానంలో పంపుతారా? క్లిష్టమైన పరిస్థితుల్లో లక్ష్య ఛేదనలో అతను జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు. సంజు శాంసన్, వైభవ్ సూర్యవంశీల విషయంలో మీరు ఎలాగైతే తప్పులు చేశారో ఇప్పుడు కేఎల్ రాహుల్ విషయంలోనూ అలాగే చేస్తున్నారు. రాహుల్ ఆరు లేదా ఏడో స్థానంలో బ్యాటింగ్ చేసే ఆటగాడా?ఇది చాలా అన్యాయం. ఒకవేళ రాహుల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి ఉంటే 2023 ప్రపంచ కప్ మాదిరిగా కోహ్లీకి తోడుగా నిలిచేవాడు. రాహుల్ వేగంగా పరుగులు రాబడతాడు. కానీ, మ్యాచ్ దాదాపు ముగిసిపోయిన తర్వాత అతన్ని బ్యాటింగ్‌కు పంపారు. ఓవర్‌కు 15 పరుగులు అవసరమైనప్పుడు అక్షర్ పటేల్‌తో కలిసి రాహుల్ మ్యాచ్‌ను ఎలా గెలిపించగలడు?" శ్రీకాంత్ ప్రశ్నించారు. ఇంగ్లాండ్‌తో మూడో వన్డేలో భారత్ 27 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ప్రత్యర్థి జట్టు 388 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా.. టీమ్ఇండియా 7 వికెట్ల నష్టానికి 360 పరుగులు చేసి పోరాడి ఓడింది. రోహిత్ (138), గిల్ (77), కోహ్లీ (74) రాణించినా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ఈ మ్యాచ్‌లో ఓటమితో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 1-2తో కోల్పోయింది.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైమ్ వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- తీర్పు వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

# కష్టకాలంలో.. విరాట్ భాయ్ అండగా నిలిచాడు : పి.వి. సింధు



భారత స్టార్ షట్లర్ పి.వి. సింధు ఇటీవల జపాన్ ఓపెన్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీకి ముందు రెండేళ్లపాటు సింధు కెరీర్ పరంగా చాలా ఇబ్బందులు పడింది. ప్రతి టోర్నీలో బరిలో దిగి ఒకటి, రెండు రౌండ్లలోనే ఇంటిముఖం పట్టింది. గాయాలు కూడా ఇబ్బంది పెట్టాయి. ఈ ఫామ్‌తో 2028 ఒలింపిక్స్ వరకూ కొనసాగుతుందా అన్న సందేహాలు కలుగుతున్న సమయంలో.. తనలో ఛాంపియన్ ఆట ఇంకా ఉందని చాటుతూ ఈ తెలుగమ్మాయి జపాన్ ఓపెన్‌లో చరిత్రాత్మక విజయాన్ని అందుకుంది. తన కెరీర్ కష్ట కాలంలో ఉన్నప్పుడు.. టీమ్ఇండియా క్రికెటర్ విరాట్ కోహ్లీ అండగా ఉన్నట్లు సింధు పేర్కొంది. కోహ్లీ మాటలు తనలో స్ఫూర్తి నింపాయని తెలిపింది. "నేను విరాట్ భాయ్‌కి ఎప్పుడూ రుణపడి ఉంటాను. నా కెరీర్ క్లిష్టమైన దశలో ఉన్నప్పుడు నేను కోహ్లీని సంప్రదించాను. వరుస గాయాలు, ఆశించిన ఫలితాలు రాకపోవడంతో సతమతమవుతున్న సమయంలో నన్ను అర్థం చేసుకునే వ్యక్తి ఒకరు నాకు అవసరమయ్యారు. కోహ్లీ నిమిషాల వ్యవధిలోనే స్పందించారు. మరుసటి రోజే మేము కలుసుకున్నాం. ఆయన ఇచ్చిన సలహాలు నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఆయన చెప్పిన మాటలు నాకు, నా భర్త దత్తాకూ బాగా గుర్తుండిపోయాయి. కొన్ని సంభాషణలు మన ఆలోచనా తీరునే మార్చేస్తాయి. అటువంటి వాటిలో ఇదొకటి" అని సింధు వివరించింది.

## స్పెయిన్ ఆటగాళ్లతో ఘర్షణ..

# అర్జెంటీనా ఆటగాళ్లపై ఫిఫా దర్యాప్తు



ఫిఫా ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ అనంతరం అర్జెంటీనా, స్పెయిన్ ఆటగాళ్ల మధ్య మైదానంలో ఘర్షణ జరిగింది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఫిఫా తెలిపింది. ఎఫ్‌డీసీ (ఫిఫా క్రమశిక్షణా నియమావళి) నిబంధనలు ఉల్లంఘించిన ఆటగాళ్లపై దర్యాప్తు కోసం క్రమశిక్షణా, ఎథిక్స్ ప్రాసిక్యూటర్‌ను నియమించామని పేర్కొంది. విచారణ పూర్తయిన తర్వాత వివరాలను బహిర్గతం చేస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. ఫిఫా ప్రపంచ కప్‌లో వరుసగా రెండోసారి విజేతగా నిలవాలని భావించిన డిఫెండింగ్ అర్జెంటీనాకు స్పెయిన్ షాక్ ఇచ్చింది. ఫైనల్‌లో 1-0 తేడాతో ఓడించింది. మ్యాచ్ అనంతరం స్పెయిన్ ఆటగాళ్లు సంబరాలు చేసుకుంటుండగా.. అర్జెంటీనా ఆటగాడు లియాండ్రో పరెడెస్ కాస్త దూకుడుగా వ్యవహరించాడు. స్పెయిన్ ప్లేయర్లు ఎరిక్ గార్సియా, గావిలపైకి వెళ్లాడు. అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు వారిని కొట్టేందుకూ యత్నించాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com